





# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 | సంచిక : 205 | పేజీలు : 8+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | సోమవారం 31 మార్చి 2025

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# అభివృద్ధి అన్నప్పుడు అడ్డంకులు రావడం సహజమే

- హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఉగాది వేడుకలు
- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వరి పండిందని వెల్లడి
- పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తామని ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాదులోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో శ్రీ విశ్వావసు నామ ఉగాది వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ... ఈ ఏడాది ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని భావిస్తున్నానని తెలిపారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. అభివృద్ధి అన్నప్పుడు అడ్డంకులు రావడం సహజమేనని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉగాది షడ్రుచుల కలయికగా ఉందని అభివర్ణించారు. బడ్జెట్ లో విద్య, వైద్య ఆరోగ్య, మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలని అన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నామని, అసాంఘిక శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఉద్ఘాటించారు. తాము నిర్మించబోయే ఫ్యూచర్ సిటీ దేశంలోని కొత్త నగరాలకు మోడల్ సిటీగా మారుతుందని అన్నారు. ఇక, దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో వరి పండిందని, ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు కూడా ఇంత వరి పండలేదని రేవంత్ రెడ్డి తెలిపారు. రేషన్ లో సన్నబియ్యం పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నామని, మన రైతులు పండించిన పంటను పేదలకు పంచబోతున్నామని చెప్పారు.



## కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దేశ విభజనకు కుట్ర చేస్తున్నాయి

- దేశ విభజన దిశగా కుట్రలు జరుగుతున్నాయన్న బండి సంజయ్
- కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మతం పేరుతో దేశాన్ని విభజించిందని మండిపాటు
- కేసీఆర్ కుటుంబ అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దేశద్రోహ వ్యాఖ్యలు చేస్తూ... దేశ విభజనకు కుట్రలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. దేశ విభజన దిశగా కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఉగాది పండుగ సందర్భంగా కరీంనగర్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాల పేరుతో దేశాన్ని విడగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారని బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే మతం పేరుతో దేశాన్ని విభజించిందని... ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాల పేరుతో దేశ విభజనకు కుట్ర చేస్తోందని విమర్శించారు. కుట్ర చేస్తున్న వాళ్లను రాళ్లతో కొట్టాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అవినీతికి పాల్పడ్డ కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పగ తీర్చుకునే రాజకీయాలు చేయబోమంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను చూస్తుంటే... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ

వివరాలు 2లో..

## మంచి సంకల్పం, పరిపాలనతో ముందుకెళ్తున్నాం..

ఉగాది వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్ పెన్ పవర్:** మంచి సంకల్పం, పరిపాలనతో తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నామని అన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించిన ఉగాది వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డితో పాటు హాజరయ్యారు భట్టీ. వేద పండితుల పంచాంగం విన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన భట్టీ.. ప్రజలందరూ ఉగాది పచ్చడి లాగా షడ్రుచులతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.

**ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం స్పీచ్:** పంచాంగంలో ఈ సంవత్సరం రాష్ట్రం అద్భుతంగా

వివరాలు 2లో..

## మయన్మార్‌లో మళ్లీ భూకంపం... పరుగులు తీసిన ప్రజలు



- భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1గా నమోదు
- శుక్రవారం నాటి భూకంపం కారణంగా 1600 మందికిపైగా మృతి
- బ్యాంకాక్‌లో గల్లంతైన 78 మంది జాడ కోసం గాలింపు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** మయన్మార్‌ను భూకంపాలు వెంటాడుతూనే ఉన్నాయి. శుక్రవారం 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం

వివరాలు 2లో..

## ఏపీలో పండుగ పూట విషాదం... ఒకే కుటుంబంలో నలుగురి ఆత్మహత్య

- శ్రీ సత్యసాయి జిల్లాలో ఘటన
- మడకశిరలో సైనైడ్ సేవించి నలుగురి బలవన్మరణం
- ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలే కారణం అయ్యుండొచ్చన్న పోలీసులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగాది రోజున ఏపీలో విషాద ఘటన చోటుచేసుకుంది. శ్రీ సత్యసాయి జిల్లాలో ఒకే కుటుంబంలో నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మడకశిర పట్టణంలో

వివరాలు 2లో..

## విశాఖలో జై షాతో కలిసి ఐపీఎల్ మ్యాచ్ వీక్షించిన మంత్రి నారా లోకేశ్...

- విశాఖలో ఐపీఎల్ మ్యాచ్
- సన్ రైజర్స్ వి ఢిల్లీ క్యాపిటల్స్
- మంత్రి లోకేశ్, జై షాలకు విశాఖలో ఘనస్వాగతం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ విద్యా, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విశాఖలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్ కు హాజరయ్యారు. విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఇవాళ సన్ రైజర్స్ హైదరాబాద్-ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్ ను నారా లోకేశ్ ఐసీసీ ఛైర్మన్ జైషాతో కలిసి వీక్షించారు.

వివరాలు 2లో..

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- ఛత్తీస్ గఢ్ లో లొంగిపోయిన 50 మంది మావోయిస్టులు
- వీరిలో 10 మంది మహిళా మావోయిస్టులు
- అందరికీ పునరావాసం కల్పిస్తామన్న బీజాపూర్ ఎస్పీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మావోయిస్టులకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్ గఢ్ లో 50 మంది మావోయిస్టులు పోలీసుల ముందు లొంగిపోయారు. బీజాపూర్ జిల్లా ఎస్పీ సమక్షంలో వీరు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో 10 మంది మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు.

వివరాలు 2లో..

## హైదరాబాద్ హెచ్‌సీయూ వద్ద ఉద్రిక్తత



- హెచ్‌సీయూ భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థుల ఆందోళన
- చెట్ల తొలగింపుతో మరింత ఉద్రిక్తత
- నిరసనకారుల అరెస్టులను ఖండించిన ఎస్ఎఫ్ఐ
- హెచ్‌సీయూ భూములు వర్సిటీకే వినియోగించాలని విద్యార్థుల విజ్ఞప్తి

వివరాలు 2లో..

## గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ.. కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం..!



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావులతో కలిసి రాజ్ భవన్‌కు వెళ్లి గవర్నర్?ను కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవర్నర్‌తో చర్చించారు. కేబినెట్ విస్తరణ గురించే సీఎం రేవంత్ గవర్నర్‌తో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ ఊహాగానాల నేపథ్యంలో గవర్నర్‌తో సీఎం సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని.. ఉగాది తర్వాత మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని గత కొన్ని రోజులుగా స్టేట్ పాలిటిక్స్‌లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌తో భేటీ కావడం ఆ వార్తలకు మరింత బలం చేకూరుస్తోంది. 2025, ఏప్రిల్ 3న మంత్రివర్గ విస్తరణ ఉండే అవకాశం ఉన్నట్లు

వివరాలు 2లో..

## శ్రీమంతులు తినే సన్నబియ్యం ఇకపై పేదలు తింటారు


**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీమంతులు తినే సన్నబియ్యం ఇకపై పేదలు కూడా తినే రోజులు వచ్చాయని హుజూర్?నగర్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఉగాది సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హుజూర్ నగర్?లో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. రేషన్?పై సన్నబియ్యం స్కీంతో చరిత్ర సృష్టించామని.. 2 కోట్ల మంది ప్రజలకు ఇకపై సన్న బియ్యం అందుతుందని తెలిపారు.ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం ఇస్తోందని.. కానీ ఉచితంగా ఇచ్చిన బియ్యాన్ని ప్రజలు పది రూపాయలకే అమ్ముకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇలా రేషన్ బియ్యాన్ని పది రూపాయలకే కొనుక్కుంటున్న

వివరాలు 2లో..



## పసిఫిక్ టోంగా దీవుల్లో భారీ భూకంపం... సునామీ అలర్ట్ జారీ

- టోంగాలో 7.1 తీవ్రతతో భూకంపం
- యూఎస్ జీఎస్ ప్రకటన
- తీర ప్రాంత ప్రజలకు సునామీ హెచ్చరికలు



**హైదరాబాద్ పెన్ పవర్:** పసిఫిక్ మహాస ముద్రంలో ఉన్న టోంగా దీవుల్లో ఆదివారం నాడు 7.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఈ మేరకు యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ భూకంపం పంగై

వివరాలు 2లో..

## వైసీపీకి ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే సీటు కూడా రాకుండా చేస్తాం

- వివేకా హత్య గురించి అవినాశ్ రెడ్డికి అంతా తెలుసన్న ఆదినారాయణరెడ్డి
- జగన్ కుటుంబమంతా కేసుల్లో ఇరుక్కుపోయిందని విమర్శ
- వారు చేసిన పాపాలను తమపై నెట్టే ప్రయత్నం చేశారని మండిపాటు



వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## పవన్ సంకల్పం.. లోకేశ్ సహకారం.. మొగల్తూరు హైస్కూల్ కు మహర్దశ

ఏపీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ యువనేత లోకేశ్ జోడి అదరగొడుతున్నారు. ఇద్దరూ కలిసి పనిచేయడమే కాకుండా ఒకరికొకరు మద్దతుగా నిలుస్తూ తమ బంధం చిరస్థాయిగా నిలుస్తుందని సంకేతాలిస్తున్నారు. ముఖ్యంగా పవన్ ను ఎంతో గౌరవిస్తున్న లోకేశ్.. జనసేనాని ఆశయాల సాధనకు నేను సైతం అంటూ లోకేశ్ ఆయన అడుగులో అడుగు వేస్తున్నారు. ముఖ్యంగా పవన్ స్వస్థలం మొగల్తూరులో పాఠశాల అభివృద్ధికి డిప్యూటీ సీఎం అనుకున్న వెంటనే మంత్రి లోకేశ్ రూ.1.71 కోట్లు విడుదల చేయడం చర్చనీయాంశం అవుతోంది. ప్రభుత్వంలో టాప్ 2, టాప్ 3 జోడి జంటగా తీసుకున్న ఈ నిర్ణయం పాఠశాల విద్యాశాఖలోనే ఓ రికార్డుగా చెబుతున్నారు.మొగల్తూరు మెగాస్టార్ చిరంజీవి సొంతూరు. పశ్చిమగోదావరి జిల్లాలో ఉండే మొగల్తూరు సాధారణ గ్రామం. మెగాస్టార్ సొంత ఊరు కావడంతో ఆ పల్లెకు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఇక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చాక తన సొంతూరికి ఏదైనా చేయాలని భావించారు. ప్రధానంగా మొగల్తూరు పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అనుకున్నదే తడువుగా తన టీమును పంపించి మొగల్తూరు పాఠశాలకు ఏయే వసతులు అవసరమవుతాయో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

పవన్ ఆశయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ కూడా మొగల్తూరు పాఠశాలపై ఫోకస్ చేశారు. తన సోదరుడు, జనసేనాని సంకల్పాన్ని తెలుసుకుని మొగల్తూరు పాఠశాలకు నిధుల వరద పారించారు. సాధారణంగా ఏదైనా పాఠశాలకు రూ.10 నుంచి రూ.20 లక్షలు కేటాయించి అభివృద్ధి పనులు చేస్తుంటారు. కానీ, డిప్యూటీ సీఎం అడిగిందే తడువుగా లోకేశ్ స్పందిస్తూ మొగల్తూరు పాఠశాలకు ఏకంగా రూ.1.71 కోట్లు విడుదల చేసి ఆ పాఠశాల రూపురేఖలే మార్చేయాలని నిర్ణయించారు.పంచాయతీరాజ్ శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రంలో రహదారులు, గోశాలల నిర్మాణంపై పెద్దఎత్తున ఫోకస్ చేశారు. పల్లెపండుగ ద్వారా గిన్నీస్ రికార్డులు నమోదు చేశారు. అభివృద్ధి పనుల్లో ఆయనతో పోటీ పడాలని భావిస్తున్న మంత్రి లోకేశ్ డిప్యూటీ సీఎం కోరుకున్న విధంగా మొగల్తూరుకి నిధులు విడుదల చేయడం పొలిటికల్ సర్కిల్స్ లో చర్చకు దారితీస్తోంది. పవన్ సంకల్పం, లోకేశ్ సహకారంతో ఒక పాఠశాల రూపురేఖలే మారిపోయాయని, ఈ జోడి తలచుకుంటే రాష్ట్రం కూడా అభివృద్ధి పథాన పరుగులు తీస్తుందని అంటున్నారు.

## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి
వీరిలో 14 మంది తలలపై రూ. 68 లక్షల రివార్డు ఉంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... 50 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారని తెలిపారు. వీరి లొంగుబాటులో సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్, డీఆర్జీ కీలక పాత్ర పోషించాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పునరావాస చర్యల్లో భాగంగా వీరిలో ఒక్కొక్కరికి రూ. 25 వేల చెక్ లను అందించామని తెలిపారు. వీరు జనజీవన స్రవంతిలో కలిసేందుకు పునరావాసం కల్పిస్తామని చెప్పారు.

# గవర్నర్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ.. కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం..!

- మొదటి పేజీ తరువాయి
ప్రచారం జరుగుతోంది. కొత్తగా నలుగురు మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేస్తారని సమాచారం. గవర్నర్?తో సీఎం రేవంత్ భేటీ కావడంతో కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైందని చర్చ జోరందుకుంది. కాగా, ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేబినెట్లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు 15 నెలలుగా కేబినెట్ విస్తరణ పెండింగ్?లో ఉండటంతో ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే విస్తరణ చేపట్టాలని రాష్ట్ర నాయకత్వం, హైకమాండ్ సూత్రప్రాయంగా నిర్ణయించాయి. ఇందులో భాగంగానే ఇటీవల ఢిల్లీలో పార్టీ పెద్దలతో రాష్ట్ర నేతలు భేటీ అయ్యి మంత్రి వర్గ విస్తరణపై చర్చించారు.

సామాజిక సమీకరణాలు, క్యాస్ట్ ఈక్వేషన్స్ వంటి అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించాయి. ప్రస్తుతం నిజామాబాద్,

ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు కేబినెట్లో ప్రాతినిధ్యం లేదు. దీంతో ఈ జిల్లాలకు కేబినెట్లో అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రస్తుతం ఎవరూ మంత్రి వర్గంలో లేరు. దీంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామికి దాదాపుగా మంత్రి పదవి ఖరారైపోయిందనే ప్రచారం ఉంది.

అలాగే.. రెడ్డి సామాజిక వర్గానికి ఈ సారి రెండు మంత్రి పదవులు దక్కుతాయనే ప్రచారం ఉంది. రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి ఉన్నారు. రాజగోపాల్ రెడ్డి చాలా కాలంగా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ముఖ్యంగా తాను హోంశాఖను కోరుకుంటున్నట్టు పదే పదే మీడియా వద్ద ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఆయనకు బెర్త్ ఖరారయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అలాగే నిజామాబాద్ జిల్లా నుంచి మంత్రులుగా ఎవరూ లేరు. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి

సుదర్శన్ రెడ్డికి చాన్స్ వస్తుందనే ప్రచారం ఉంది. ముదిరాజ్ కోటాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఫిక్స్ అయినట్లు టాక్. ప్రస్తుతం భర్తీ చేయనున్న నాలుగు మంత్రి పదవుల రేసులో ఈ నలుగురు ముందు వరుసలో ఉన్నారు. ఇప్పటి వరకు అయితే హైకమాండ్ అధికారికంగా మంత్రి పదవుల జాబితాను ప్రకటించలేదు. దీంతో ఆమాత్య యోగం ఎవరికీ దక్కుతుందోనని కాంగ్రెస్ శ్రేణులతో పాటు.. రాష్ట్ర రాజకీయాల్లోనూ ఉత్కంఠ నెలకొంది. మరీ ఈ ఉత్కంఠకు తెరపడాలంటే కాంగ్రెస్ హైకమాండ్ మంత్రి పదవుల జాబితా ప్రకటించే వరకు వెయిట్ చేయాల్సిందే.

## శ్రీమంతులు తినే సన్నబియ్యం ఇకపై పేదలు తింటారు

- మొదటి పేజీ తరువాయి
మిల్లర్లు వాటిని రీసైక్లింగ్ చేసి మళ్లీ 50 రూపాయలకు అమ్ముతున్నారని సీఎం వివరించారు. పేదల నుంచి రేషన్ బియ్యాన్ని కొంటున్న మిల్లర్లు కోట్ల రూపాయల దందా చేస్తున్నారని సీఎం తెలిపారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో రాష్ట్ర ప్రజలు సన్న బియ్యానికి మొగ్గుచూపుతున్నారని, అందుకే ప్రజల ఆకాంక్ష మేరకు రేషన్ కార్డులపై సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయాలనే ఆలోచన గత సీఎంకు ఎప్పుడూ రాలేదని, గత సీఎం వరి వేస్తే ఉరే అని ప్రజలు వరి పండించకుండా

బెదిరించారని కేసీఆర్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సన్నబియ్యంపై క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తోందని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 12 లక్షల టన్నుల సన్న వడ్లు పండితే.. నల్గొండ ప్రజలే 8 లక్షల టన్నులు పండించారని సీఎం రేవంత్ తెలిపారు. సన్న బియ్యం పథకాన్ని భవిష్యత్?లో ఎవరూ రద్దు చేసే సాహసం కూడా చేయరని, ప్రభుత్వాలు మారినా కూడా సన్నబియ్యం పథకం ఎప్పటికీ కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

## విశాఖలో జై షాతో కలిసి ఐపీఎల్ మ్యాచ్ వీక్షించిన మంత్రి నారా లోకేశ్...

- మొదటి పేజీ తరువాయి
అంతకుముందు విశాఖ క్రికెట్ స్టేడియానికి చేరుకున్న మంత్రి లోకేశ్, ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీలకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, ఇతర సభ్యులు ఘనస్వాగతం పలికారు. మంత్రి లోకేశ్ ను ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని శాలువాతో సత్కరించి మొమెంటో బహూకరించారు. అనంతరం స్టేడియం పునరుద్ధరణ, ఆధునికీకరణను పురస్కరించుకుని ఐసీసీ ఛైర్మన్ జై షా, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని చిన్నితో కలిసి నారా లోకేశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ శ్రీ భరత్, మాజీ క్రికెటర్ చాముండేశ్వరినాథ్,

బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్, ట్రెజరర్ దండమూడి శ్రీనివాస్, ఇతర ఏసీఈ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు కూడా పాల్గొన్నారు.

ఇవాళ విశాఖ ఎయిర్ పోర్ట్ కు చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఐసీసీ ఛైర్మన్ జై షాకు టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

## పసిఫిక్ టోంగా దీవుల్లో భారీ భూకంపం... సునామీ అలర్ట్ జారీ

- మొదటి పేజీ తరువాయి
గ్రామానికి ఆగ్నేయంగా 90 కిలోమీటర్ల (56 మైళ్లు) దూరంలో సంభవించింది. దీని ప్రభావం నియు ద్వీప దేశం వరకు విస్తరించిందని హెచ్చరికలు జారీ చేశారు.అమెరికా సునామీ హెచ్చరిక కేంద్రం సునామీ వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది. నియు, టోంగా తీరాల్లో అలల స్థాయి 0.3 మీటర్ల నుంచి 1 మీటర్ల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది. తొలుత, భూకంప కేంద్రం నుంచి 300 కిలోమీటర్ల పరిధిలో ప్రమాదకరమైన సునామీ అలలు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించింది.తీర ప్రాంతాలకు దూరంగా ఉండాలని టొంగా అధికారులు ప్రజలకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఎత్తైన ప్రాంతాలకు లేదా తీర ప్రాంతానికి దూరంగా వెళ్లాలని టోంగా నేషనల్ డిజాస్టర్ రిస్క్ మేనేజ్‌మెంట్ కార్యాలయం ఫేస్‌బుక్ ద్వారా తెలిపింది.టోంగాలో భూకంపాలు సాధారణం. ఇది తక్కువ ఎత్తులో ఉన్న ద్వీపసమూహం. ఇక్కడ దాదాపు 1,00,000 మంది ప్రజలు నివసిస్తున్నారు. ఇది ఆగ్నేయాసియా గుండా పసిఫిక్ బేసిన్ వరకు విస్తరించి ఉన్న తీవ్రమైన టెక్టోనిక్ కార్యకలాపాల ప్రాంతమైన 'రింగ్ ఆఫ్ ఫైర్' పై ఉంది.శుక్రవారం మధ్యాహ్నం మయన్మార్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించడం తెలిసిందే. దీని ప్రభావంతో అనేక భవనాలు కూలిపోయాయి. విమానాశ్రయంతో సహా ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి. 1,600 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్ లోనూ భూకంప ప్రభావంతో 10 మంది మరణించారు.

## మయన్మార్‌లో మళ్లీ భూకంపం... పరుగులు తీసిన ప్రజలు

- మొదటి పేజీ తరువాయి
1600 మందికిపైగా ప్రాణాలను బలితీసుకుంది. తాజాగా మయన్మార్‌లోని రెండో అతిపెద్ద నగరమైన మాండలే సమీపంలో 5.1 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు ప్రాణ భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.శుక్రవారం సంభవించిన భూకంపం ధాటికి రోడ్లు, వంతెనలు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినడంతో సహాయక చర్యలకు విఘాతం కలుగుతోంది. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతుండటంతో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నిన్న ఏకంగా మూడు భూకంపాలు మయన్మార్ ప్రజలను భయపెట్టాయి. ఉదయం 11.53 గంటలకు 4.3 తీవ్రతతో, మధ్యాహ్నం 2.30 గంటలకు 3.8 తీవ్రతతో, 20 నిమిషాల అనంతరం 4.7 తీవ్రతతో మరో భూకంపం ప్రజలను భయపెట్టింది.శుక్రవారం నాటి భూకంపం కారణంగా థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో నిర్మాణంలో ఉన్న హైరైజ్ భవనం కుప్పకూలిన ఘటనలో అక్కడ పనిచేస్తున్న 78 కార్మికుల జాడ ఇంకా తెలియరాలేదు. నగరంలో చనిపోయిన మరో 10 మందిని నిన్న గుర్తించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

## మంచి సంకల్పం, పరిపాలనతో ముందుకెళ్తున్నాం..

- మొదటి పేజీ తరువాయి
ఉంటుందని చెప్పారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తాము.
మంచి వర్షాలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది.
మంచి పాలనతో, మంచి సంకల్పంతో రేవంత్ రెడ్డి, మంత్రివర్గంతో రాష్ట్రం ముందుకు వెళుతుంది.
ప్రజలందరికీ అన్ని రకాలుగా వసతులు కల్పించే విధంగా, అన్ని వర్గాలకు న్యాయం చేసే విధంగా, అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తున్నాం.
అన్ని రంగాలు అభివృద్ధి చెందే విధంగా బడ్జెట్ తీసుకొచ్చాం.
ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన, హైదరాబాద్ నగర అభివృద్ధి, ట్రిబుల్ ఆర్ వంటి అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది.
ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దేశ విభజనకు కుట్ర చేస్తున్నాయి

- మొదటి పేజీ తరువాయి
ఒకటే అనే విషయం అర్థమవుతోందని అన్నారు. కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని... అవినీతికి పాల్పడ్డ వారిని జైలుకు పంపించాలని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సన్నబియ్యం ఇస్తున్నామని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందని... కానీ, వాటిని ఇస్తున్నది కేంద్ర ప్రభుత్వమని అన్నారు. కేజీ బియ్యం మీద కేంద్ర ప్రభుత్వం రూ. 40 ఖర్చుస్తోందని... కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ. 10 మాత్రమే ఖర్చు చేస్తోందని చెప్పారు. అందుకే ఈ పథకంపై ప్రధాని మోదీ ఫోటో పెట్టాలని అన్నారు.

### ఏపీలో పండుగ పూట విషాదం...

## ఒకే కుటుంబంలో నలుగురి ఆత్మహత్య

- మొదటి పేజీ తరువాయి
ఈ ఘటన జరిగింది. స్వర్ణకారుడు కృష్ణమాచారి (55), భార్య సరళమ్మ, వారి ఇద్దరి కుమారులు సంతోష్, భువనేశ్ తమ ఇంట్లో విగతజీవులుగా కనిపించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇవాళ ఉదయం కృష్ణమాచారి ఇంటికి ఆయన తండ్రి వచ్చినప్పుడు ఈ ఘటన వెలుగుచూసింది. ఆయన ఇతర బంధువులకు, పోలీసులకు సమాచారం అందించారు. కాగా, ఆ నలుగురు అత్యంత ప్రాణాంతక విషం సైనైడ్ సేవించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. తమ కుమారులకు విషం ఇచ్చి, ఆపై కృష్ణమాచారి, సరళమ్మ కూడా విషం తీసుకుని ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు తోడు, కుటుంబ పరమైన సమస్యలు కూడా వారి బలవన్మరణాలకు దారితీసి ఉంటాయని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు.

## హైదరాబాద్ హెచ్‌సీయూ వద్ద నేడు కూడా ఉద్రిక్తత

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళనలు తీవ్రరూపుదాల్చుతున్నాయి. వేలాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు నిన్నటి నుంచి నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో, ఇవాళ విశ్వవిద్యాలయం ఆవరణలో చెట్లను తొలగించడానికి ప్రభుత్వం పూనుకోవడంతో వివాదం మరింత ముదిరింది. నేడు కూడా హెచ్‌సీయూ విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. చెట్లను తొలగించేందుకు అధికారులు తీసుకువచ్చిన జేసీబీలను విద్యార్థులు అడ్డుకున్నారు.నిరసన తెలుపుతున్న విద్యార్థులను పోలీసులు అరెస్టు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. విద్యార్థుల అరెస్టులను తెలంగాణ ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. అహంకారపూరితంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం వెంటనే విద్యార్థులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. యూనివర్సిటీకి చెందిన

సుమారు 500 ఎకరాల భూమిని గత 50 ఏళ్లలో వివిధ కారణాలతో ప్రభుత్వం వెనక్కి తీసుకుందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. మొదట్లో 2,300 ఎకరాలలో హెచ్‌సీయూ ఉండగా, ప్రస్తుతం యూజీసీ లెక్కల ప్రకారం 1800 ఎకరాలు మాత్రమే ఉందని వారు పేర్కొంటున్నారు. తాజాగా, టీజీఐఐసీ ద్వారా 400 ఎకరాలను వేలం వేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంతో విద్యార్థులు, సిబ్బంది ఆందోళన బాట పట్టారు. అయితే, ఈ స్థలం హెచ్‌సీయూకు చెందదని, కోర్టు తీర్పు మేరకే అభివృద్ధి కోసం 400 ఎకరాల భూమిని టీజీఐఐసీకి అప్పగించామని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనిపై విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ మంత్రి శ్రీధర్ బాబులు ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, హెచ్‌సీయూ భూములు వర్సిటీ అవసరాలకే వినియోగించేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి






**జీలుగుమిల్లి, పెన్ పవర్ బీమార్చి 30:**పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని గ్రేస్ మందిర్ వ్యవస్థాపకులు రేవా బి ఎజ్రా శాస్త్రి డిమాండ్ చేశారు. ఆదివారం మండల క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు . గ్రేస్ మందిరం నుండి హైస్కూల్ వద్దకు శాంతి ర్యాలీ నిర్వహించి జగదాంబ సెంటర్లో మానవహారం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద బి ఎజ్రా శాస్త్రి మాట్లాడుతూ ప్రవీణ్ మృతి పై ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేసి మృత్య కి కారణమైన దోషులను శిక్షించాలని కోరారు. అంతేకాక క్రైస్తవులపై దాడిని ఖండించాలని ప్రభుత్వాన్ని కోరారు .ప్రవీణ్ పగడాల మృతి క్రైస్తవుల హృదయాలలో దిగ్భ్రాంతిని మిగిల్చారని అన్నారు. క్రైస్తవులంతా ఐక్యంగా ఉండి పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ పాస్టర్ వినోద్ కుమార్, యుపిఎఫ్ మండల అధ్యక్షులు టి సురేష్, గౌరవ అధ్యక్షులు కే అబ్రహం, డి మోజేష్, ఎం జ్యోతి బాబు, యూపీఏ అధ్యక్షులు ఎస్ సాల్మన్ రాజు, సీఎన్ కుమార్, సాధు సుందర్ సింగ్, కార్యదర్శి జాన్ ప్రసాదు, సహాయ కార్యదర్శి నక్క శ్రీనివాసు, మాజీ జెడ్పిటిసి బి రాజబాబు, బి ప్రేమ్ కుమార్, వి ధనుంజయ, పద్దం వెంకటకృష్ణ ,కొప్పుల సత్యనారాయణ, కోరం వెంకటేశ్వరరావు, తదితర క్రైస్తవులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.

# మజ్జిగ చలి వేంద్రాలు ఏర్పాటు

● దాహార్తిని తీర్చుకున్న భక్తులు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 30:**ఆలమూరు మండలం చింతలూరులో వేంచేసియున్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఉగాది పర్వదినం సందర్భంగా దాతల సహకారంతో ఆదివారం విరివిగా మజ్జిగ చలి వేంద్రాలు ఏర్పాటు జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే వేలాది మంది భక్తులు దాహార్తిని తీర్చేందుకు దారి పొడవునా దాతలు ఈ చలివేంద్రాలను ఏర్పాటు చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కొత్తూరు సెంటర్ లో పెదపళ్లకు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థ బాలాజీ గ్రూప్స్ ఆధ్వర్యంలో భారీ చలివేంద్రం ఏర్పాటు జరిగింది. అలాగే చింతలూరులో శ్రీ గోశాల గోపరాంథామం, గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో,పినపళ్ల లో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఈ చలి వేంద్రాలు ఏర్పాటు జరిగింది. ఆలయ ఆవరణలో ప్రతియేటా మాదిరిగానే సంధిపూడికి చెందిన శ్రీకోదండరామ ఆలయ కమిటీ ప్రతినిధులు మజ్జిగ చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు.

అలాగే తీర్థంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో త్రాగునీరు, చంటి పిల్లలకు పాలును అందజేసారు.

# చలివేంద్రం ఏర్పాటు

ఫోటోగ్రాఫర్ యూనియన్






**టీ నర్సాపురం,పెన్ పవర్, మార్చ్ 30:**టీ నర్సాపురం హైస్కూల్ ప్రాంగణం బయట ఫోటోగ్రాఫర్ యూనియన్ వారిచే నిర్మించిన బస్ షెల్టర్ వద్ద ఆదివారం చలివేంద్రమునుఎస్ఐజయబాబు ప్రారంభించారు. ఆయన చేతుల మీదుగాప్రయాణికులకుమజ్జిగ,లెమన్ వాటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టటం చాలా ఆనందకరమైన విషయం అని కొనియాడారు. ఇలాంటి మరెన్నో మంచి పనులతో పాటు సేవా కార్యక్రమాలు కూడా చేయాలని ఎస్ఐ జయబాబు సూచించారు. ఈ చలివేంద్రం ప్రయాణికులకు,పాదాచారులకు, వాహనదారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని వారి దాహార్తిని తీరుస్తుందని ఇటువంటి కార్యక్రమాలు చేపట్టటం పట్ల యూనియన్ సభ్యులకి గౌరవం దక్కిందని ఎస్ఐ కొనియాడారు. ఫోటోగ్రాఫర్ యూనియన్ ను ప్రత్యేకంగాఅభినందించారు. ఈకార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు. ఆర్ వెంకటేశ్వరావు, కార్యదర్శి.
పి.చందు, సహాయ అధ్యక్షులు మహారాజ్, కోశాధికారి వాసు, రామారావు ,ధర్మారావు,రాజు, యూనియన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ వసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం

జగన్మోహిని కేశవ స్వామి ఆలయ సన్నిధిలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు








**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 30:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ సన్నిధిలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని పంచాంగ శ్రవణము, భక్తులకు వినిపించిన ఆలయ పండితులు. విశ్వ వసు నామ సంవత్సరంలో12 రాశుల వారు వారి యొక్క యోగక్షేమాలను విధి విధానాలను పండితులు ఎంతో చక్కగా ఆలపించారు. ఈ కార్యక్రమంలోఆలయ కార్యనిర్వాహణాధికారి బి. వెంకటరమణమూర్తి,పండితులు భక్తులు ,గ్రామస్థులు విశేషముగా విచ్చేసి శ్రీ స్వామి వారిని దర్శించుకొని పంచాంగ శ్రవణమును ఆలకించి, స్వామివారి ఆశీర్వచనం పొంది,స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం పండితులకు ఆలయ అధికారి బి. వెంకట రమణమూర్తి , పండితులను విశ్వావసు నామ సంవత్సర పురస్కరించుకుని దుస్సాలతో సత్కరించారు.

# గోపాలపురంలో పాస్టర్ల శాంతి ర్యాలీ






**గోపాలపురం, పెన్ పవర్,మార్చి 30:**పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపం తెలియజేస్తూ మండలంలోని పాస్టర్లు ఆదివారం సాయంత్రం భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. పెద్దగూడెంలోని లూథరన్ చర్చ్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ జాతీయ రహదారి మీదుగా స్థానిక బస్టాండ్ సెంటర్ నుండి చెక్ పోస్ట్ సెంటర్ వద్ద నాలుగు రోడ్ల కూడలికి చేరుకుంది. అక్కడ స్వర్గీయ వైఎస్ఆర్ విగ్రహం వద్ద మానవహారం చేపట్టారు. అనంతరం పలువురు దైవ సేవకులు మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ ఆత్మకి శాంతి చేకూరాలని అన్నారు. ప్రభుత్వం ప్రవీణ్ మృతి విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. మృతికి సంబంధించిన వివరాలను బట్టబయలు చేయాలని దానికి కారకులు ఎవరో తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. పలువురు దైవ సేవకులు మోకాళ్ల పై ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు జి. పాల్ రాజ్, కార్యదర్శి డి. నిరీక్షణ నిర్మల్ కుమార్, ఏ ఈ ఎల్ సి గురు మండల అధ్యక్షులు బి.ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు శామ్యూల్, పి.కృపావరం, డి.జకరయ్య,జి.ఎలీషా, పి.గాబ్రియేల్, బి.పరం జ్యోతి, టి. ఏసు రాజు, కరుణాకర్ లతోపాటు మండల నలుమూలల నుండి దైవ సేవకులు, క్రైస్తవ మత విశ్వాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

# డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా టెన్నికాయిట్ ప్రధాన కార్యదర్శిగా చింతా రవివర్మ






**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 30:**డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా టెన్నికాయిట్ ప్రధాన కార్యదర్శిగా ఆలమూరుకు చెందిన మోదుకూరు వీఏఏ చింతా రవివర్మను రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు పేరం రవీంద్ర, సెక్రటరీ కె.ఎన్.వి సత్యనారాయణలు నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర టెన్నికాయిట్ అసోసియేషన్ సభ్యులు వై.డి రామారావు, శ్రీమతి ఏ.కృష్ణ కుమారి, కుంచె రమేష్ లు రవివర్మకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలమూరులో ఆదివారం రవివర్మ మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 25 నుండి 29 వరకు ఒడిస్సా రాష్ట్రం భువనేశ్వర్ లో జరిగిన 46వ జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ కు చెందిన పలువురు అత్యుత్తమ ప్రతిభ చూపించారని అన్నారు. ఈ పోటీల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన లేగా త్రిమూర్తులు, పిల్లి రామారావులు జాతీయస్థాయిలో నాలుగవ స్థానాన్ని సాధించారని ఆయన తెలిపారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం మేనేజర్ గా తాను వ్యవహరించానని, జిల్లా నుంచి రిఫరీ కుంచె రమేష్ పాల్గొన్నారని తెలిపారు. జిల్లాలో, మండలంలో టెన్నికాయిట్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

# ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు - ప్రసాద్ రెడ్డి



**గోపాలపురం,పెన్ పవర్, మార్చి 30:**వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చుడానికి చదివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని గోపాలపురం వర్తక సంఘం అధ్యక్షులు వింత అమల ప్రసాద్ రెడ్డి అన్నారు. గోపాలపురానికి చెందిన అమన్ ప్రజా మెడికల్ షాపు, ప్రతాప్ ఫ్యాన్సీ షాపు, వర్తక సంఘం ఆధ్వర్యంలో గోపాలపురంలో బస్టాండ్ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రసాద్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలు రోజురోజుకీ పెరుగుతున్న దృశ్య ప్రజలు నీరు ఎక్కువగా త్రాగాలని అన్నారు. దాతలు ముందుకు వచ్చి జనసంచారం ప్రాంతంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. స్థానిక ఆంజనేయ స్వామి వారి విగ్రహం వద్ద ఈ చరివేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందించారు. మొదటి రోజు అమన్ ప్రచార మందుల షాపు, ప్రతాప్ ఫ్యాన్సీ షాపు ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్, శ్రీనివాస్, మణికంఠ, మోహన్, గోపి, చిన్న, తిలక్ తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా పిడుగులమ్మ తల్లి జాతర మహోత్సవాలు



● రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వమ్మి బాలాజీ,

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 30 :**సంజయ్ నగర్ ప్రాంత గ్రామదేవత అయిన శ్రీ పిడుగులమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించబోతున్నట్లు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వమ్మి బాలాజీ, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షులు బాసి రమణారెడ్డి పేర్కొన్నారు.కాకినాడ నగరం సంజయ్ నగర్ ప్రాంత గ్రామదేవత అయిన శ్రీశ్రీశ్రీ పిడుగులమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఉగాది పర్వదినం సంధర్భంగా త్వరలో జరగనున్న అమ్మవారి జాతర కు సుముహుర్తాన్ని ఖరారు చేశారు. ముందుగా నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వమ్మి బాలాజీ , ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, కూటమి పార్టీల నాయకుల సమక్షంలో అమ్మవారి జాతరకు గాను అర్చకులు తిథులను చూసి ఉత్సవాల తేదీని ఖరారు చేశారు. ఈ సంధర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వమ్మి బాలాజీ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఉగాది రోజునే అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తం పెట్టడం జరుగుతుందని, అదే పరంపరను కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా ఉగాది రోజునే ముహూర్తం పెట్టడం జరిగిందని తెలిపారు. మే నెల 17వ తేదీ నుండి 20వ తేదీ వరకు శ్రీ పిడుగులమ్మ తల్లి అమ్మవారి జాతర నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందని, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సూచనలతో దాతల సహకారంతో అమ్మవారి జాతర ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు సరగడ రమణ మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఈ జాతర మహోత్సవాలను దిగ్విజయంగా జరిపించేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పలివెల బాబ్జి, జొన్నా వెంకన్న, యలమంచిలి శ్రీను యాదవ్, ఎస్.కె బాషా, వమ్మి దుర్గా శంకర్, గురుసు ఆదిబాబు,చిరంజీవి, పి.దొరబాబు, గాలి దుర్గారెడ్డి, మరపురెడ్డి శ్రీనివాస్, మరపురెడ్డి ధర్మరాజు, అల్లం గోవిందు, వమ్మి శ్రీసాయి, మంగం వెంకటరావు, మల్లిపూడి రామకృష్ణ, సప్పా కుమార్, వి.శేఖర్, జగదీష్ చౌదరి, ఆకేటి గోవిందు, వి.రాజు, కుప్పిలి శంకర్, పరిమి వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# సంధిపూడిలో ఉగాది కవి సమ్మేళనం



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 30:**సంధిపూడి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో భాగంగా ఆదివారం పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనం నిర్వహించారు. బాల మందిరం వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణ శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆలమూరు మండల స్థాయి కవితల పోటీల్లో విజేతలను సన్మానించి, సత్కరించారు. ఈ కవితా పోటీలకు మొత్తం 12 కవితలు వచ్చాయని, అందులో నాలుగు కవితలను బహుమతులకు ఎంపిక చేసి సత్కరించినట్లు ఆయన తెలిపారు. ప్రముఖ పద్య కవి కామవరపు మల్లికార్జునరావు(గౌరీ మల్లిక్) రచించిన పద్య కవితలు, సూర్య ఆకుల రచించిన విశ్వావసు విశ్వశాంతి, ఎన్. శిరీష రచించిన చైత్రమా! ఎవరికోసం నీ ఎదురుచూపులు, గొడవర్తి శ్రీనివాసు రచించిన విశ్వశాంతిని రక్షించండి కవితలను ఎంపిక చేసి సత్కరించారు. ఈ సందర్భంగా కవులు తమ కవితలను గానం చేశారు. అనంతరం వారికి గ్రామ పెద్దలు తోరాటి చలపతి, సూరపురెడ్డి బాబ్జీ తదితరుల చేతుల మీదుగా సత్కారం నిర్వహించారు. కార్యక్రమంలో తోరాటి చంటి, వుడతా వెంకటేశ్వరరావు, వాసా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలి

- చలి వేంద్రం ప్రారంభించిన సివిల్ సప్లైస్ చైర్మన్ తోట సుధీర్




**కాకినాడ.పెన్ పవర్ మార్చి 30 :**వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి
చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర సివిల్ సప్లైస్ చైర్మన్, జనసేన కాకినాడ సిటీ అద్యక్షుడు తోట సుధీర్ పిలుపునిచ్చారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కాకినాడ రామారావు పేట శివాలయం వద్ద వీర మహిళా స్వయం శక్తి, ఓం ఫౌండేషన్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తో ట సుధీర్ మాట్లాడుతూ వేసవిలో ఆలయాలకు విచ్చేసే భక్తులతో పాటుగా వివిధ పనుల ని మిత్తం ఇతర ప్రాంతాల నుంచి కాకినాడ విచ్చేసే ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలి వేందాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వేసవిలో కాకినాడలోనే గాకుండా ఇతర ప్రాంతాలలోని ముఖ్యమైన ప్రదేశాలలో జనసేన ఆధ్వర్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తోట తెలిపారు. చలివేంద్రాన్ని నిర్వహించేందుకు ఎందుకు వచ్చిన వీర మహిళా స్వయం శక్తి, ఓం ఫౌండేషన్ ఇండియా సేవలను ఈ సందర్భంగా సివిల్ సప్లైస్ చైర్మన్ సుధీర్ అభినందించారు. ఈ సందర్భంగా మొదటి రోజు
చలివేంద్రంలో సుమారు 300 మంది రస్నా డ్రింక్ పంపిణీ చేశారు. వేసవి కాలం ముగిసే వరకూ ఈ చలివేంద్రాన్ని నిర్వహిస్తామని జనసేన నాయకులు అడబాల రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ జనసేన ఉపాధ్యక్షుడు, దిశ కమిటీ సభ్యులు అడబాల సత్యనారాయణ, యేలేటి సోనీ,40వ డివిజన్ జనసేన ఇన్చార్జి అడబాల సౌజన్య రాజేంద్రప్రసాద్, టీడీపీ ఇంచార్జి బాబ్జీ, కాకినాడలోని పలు డివిజన్ల జనసేన ఇంచార్జులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గంగాలమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహూకరించిన “పిల్లి” దంపతులు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 30 :**
దైవ సంకల్పం లేనిదే మానవ ప్రయత్నాలు విజయవంతం కావని.. తనవంతుగా అమ్మవారికి ఇలా కిరీటం ఇవ్వడం తన పూర్వజన్మ సుకృతముగా కో ఆర్డినేటర్,మాజీ ఎమ్మెల్యే “పిల్లి “ దంపతులు తెలిపారు. వాకలపూడి గ్రామంలో వెలిసిన శ్రీ గంగాలమ్మ అమ్మవారికి కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు రూ.6 లక్షల విలువైన 4.5కేజీ ల వెండి కిరీటం, చెవి కమ్మలు ఆలయ కమిటీ సమక్షంలో కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి ఎదుగుదలకు ఆధ్యాత్మికం ఎంతో అవసరమని ఇటువంటి పూజా కార్యక్రమాలు మన సంప్రదాయాల గొప్పతనాన్ని గుర్తుచేస్తాయని ఇది భక్తుల భక్తి, విశ్వాసం, సమర్పణకు ప్రతీక అని అన్నారు.ఆలయం నిర్మించే సమయంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ వారు తమను ఆహ్వానించడం జరిగిందని, అమ్మవారికి వెండి కిరీటం అందజేస్తామని తమ కుటుంబ సభ్యులందరూ మాట ఇవ్వడం జరిగిందని అందులో భాగంగానే కిరీటం,చెవి కమ్మలు అమ్మవారికి అలంకరించడం జరిగిందన్నారు. నూతనంగా నిర్మించిన ఆలయం కేవలం భవనం మాత్రమే కాదు, భక్తుల ఆధ్యాత్మిక జీవితానికి మార్గదర్శనం కూడా అని.. ఈ వెండి కిరిటం అమ్మవారి పట్ల భక్తుల ప్రేమను ప్రతిబింబిస్తుందని అన్నారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కమిటీ సభ్యులు మాతా లక్ష్మణ్, గింజల శ్రీనివాసరావు ను పిల్లి దంపతులు సత్కరించారు.
తొలుత జాతర సందర్భంగా నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి విచ్చేసిన పిల్లి సత్యనారాయణ మూర్తి అనంత లక్ష్మి దంపతులుకు, వారి కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పిల్లి కృష్ణ కళ్యాణ్,పిల్లి రాధ కృష్ణ , కృష్ణ సరిత, ఆలయకమిటి మాతా లక్ష్మణ్, గింజల శ్రీనివాసరావు,బుజ్జి,జగన్, వీరగని వెంకటేశ్వరరావు, తాతపూడి రామకృష్ణ,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ లో ఘనంగా ఉగాది వేడుకలు



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 30 :**కాకినాడ ప్రెస్ క్లబ్లో రిజిస్టర్ నెంబర్ 383/2021 గత నాలుగేళ్లుగా కొనసాగుతున్న క్లబ్ లో ఆదివారం విశ్వావసు నామ ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఆదివారం ఉదయం 10 గంటలకు క్లబ్లో వేదమంత్రోచ్చనాలతో మూర్తి ఆచార్యులు విశేష పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేసారు.అనంతరం ఉగాది పచ్చడిని,పులిహోర ప్రసాదంను క్లబ్బు సభ్యులకు అందించారు. కాకినాడ ప్రెస్క్లబ్లో సర్వ మతాలకు చెందిన వేడుకలను, కార్యక్రమాలను కార్యవర్గం నిర్వహించడం పట్ల పలువురు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ వేడుకలకు కాకినాడ ప్రెస్ క్లబ్ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ,మార్చి 30:**రంపచోడవరం గ్రామ శివారులోని రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు కార్యదర్శి పరిజ్ఞానానంద జి మహారాజ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వైద్యనిపుణులు డాక్టర్ దాసరి ఉమా మహేష్ ,డాక్టర్ పి వి సుబ్బారావు ,ఫిజియోథెరపిస్ట్ సంపత్ కుమార్ సుమారు వందమంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయడం జరిగిందని స్వామీజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందజేస్తున్న వైద్య సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. ఈ సందర్భంగా రోగులకు ,సహాయకులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ క్యాంపు కోఆర్డినేటర్ కే శ్రీనివాస్ ,రామకృష్ణ మిషన్ సిబ్బంది ,వాలంటీర్లు పాల్గొన్నారు.



# ఘనంగా ఉగాది వేడుకలు

**వారాహి దేవికి హెూమాలు**

**హాజరైన ఎమ్మెల్యే**



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 30 :**తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వారాహి దేవి హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు,నానాజీ హాజరయ్యారు.వీరితోపాటు జిల్లా నలుమూలల నుంచి తెలుగుదేశం పార్టీ అగ్ర నాయకులు హాజరయ్యారు .కరప మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి, సత్తిబాబు సహా అగ్ర నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఉగాది పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. అనంతరం వచ్చిన వారందరిని బాబీ సత్కరించారు. బాబికి పదవి రావాలంటూ వేద పండితులు ఆశీస్సులు అందచేశారు.వెయ్యి మంది పైగా టిడిపి ,బిజెపి, జనసేనకు చెందిన నాయకులు విచ్చేసి వారాహి దేవి హెూమంలో పాల్గొన్నారు. అనంతరం ఉగాది వేడుకల్లో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. లోక కళ్యాణం కోసం, కూటమి ప్రభుత్వం మరింత ప్రజాదరణతో ముందుకెళ్లాలని కోరుతూ ఈ హెూమం నిర్వహించినట్లు బాబి తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రూరల్ అబ్జర్వర్ కుడుపూడి సత్తిబాబు,తెలుగుదేశం పార్టీ కాకినాడ రూరల్ మండల అధ్యక్షుడు రాందేవ్ సీతయ్య దొర జనసేన కాకినాడ రూరల్ మండల అధ్యక్షుడు కరెడ్ల గోవింద, కరప మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దేవు వెంకన్న, కరప మండల జనసేన అధ్యక్షుడు బండారు మురళి, కరప మాజీ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాస్, కాకినాడ సిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షు మల్లిపూడి వీరు, రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, మాగిరెడ్డి భాస్కరరావు, కాకర్లపల్లి చలపతిరావు, పితాని అప్పన్న, మార్కండేయులు, దొరబాబు, సవరపు సత్తిబాబు, చోడిశెట్టి కృష్ణ, తోట కృష్ణ, పలివెల త్రిమూర్తులు, కర్రి శ్రీను, కోటమ్మ నాయకులు పద్ధతిలో పాల్గొన్నారు.

## శ్రీ దేవి ముత్యాలమ్మ జాతర అంగరంగ వైభవంగా





**-ఏడుకొమ్ముల యాటపోతు, పెసరపప్పు,బెల్లం నైవేద్యం అమ్మవారికి**

**కూనవరం,పెన్ పవర్,మార్చి 30.**శ్రీ విశ్వ వాసు నామ ఉగాది పండుగ పర్వదినం సందర్భంగా మర్రిగూడెం గ్రామంలో వేంచేసిన శ్రీదేవి ముత్యాలమ్మ తల్లి అమ్మవారి దేవస్థానం నందు ఉదయం నుండి భక్తులు బారులు తీరారు.అమ్మవారికి మహిళా భక్తులు పసుపు,కుంకుమ, గాజులు,చీర,జాకెట్, అమ్మవారికి ప్రీతిపాత్రమైన పెసరపప్పు,బెల్లంతో నైవేద్యం సమర్పించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.అమ్మవారి జాతరలో ఏడుకొమ్ముల వేటపోతులు(కోడిపుంజులను) సమర్పించారు.అమ్మవారి తిరుణాల జాతరలో రంగురంగుల బొమ్మలు, మిఠాయిలు,బూరలు కొనుక్కొని ఊదుతూ పిల్లలు ఆనందానికి అవధులు లేవు. హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు మండు వేసవిలో చల్లని మజ్జిగను భక్తులకు అందించి దాహార్తిని తీర్చారు.అనంతరం దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి స్థానిక ఎస్ ఐ లతా శ్రీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్ ఐ,పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రశాంతంగా జాతర ముగిసింది.ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ పాల్గొన్నారు.

## నేడు మార్టేరు జంక్షన్లో శాంతియుత క్యాండిలైట్ సర్వీస్

**పెనుమంట్ర, పెన్ పవర్, మార్చి 30:** ఛలో మార్టేరు శాంతియుత ర్యాలీ క్యాండిల్ లైట్ సర్వీస్ జయప్రదం చేయాలని ఆచంట నియోజవర్గ యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా జేఏసీ యుపిఏ నాయకులు ఈనెల 25న రాజమండ్రిలో పాస్టర్ పగడాల ప్రవీణ్ ప్రధాన రహదారి గోతిలో మృతి చెంది ఉండడంపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ,దీనిపై ఉన్నత స్థాయి న్యాయం విచారణ జరిపించాలని కోరుతూ నేడు (సోమవారం) సాయంత్రం నాలుగు గంటలకు పెనుమంట్ర మండలంలోని మార్టేరు జంక్షన్లో శాంతియుత ర్యాలీ క్యాండిలైట్ సర్వీస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెనుమంట్ర,పోడూరు,ఆచంట,పెనుగొండ మండలాల యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు,ఎన్సిసి, ఏఐసీసీ తదితర క్రైస్తవ సంఘాల నాయకులు,యూత్ నాయకులు,స్త్రీ సమాజ నాయకులు,విశ్వాసులు, క్రైస్తవ అభిమానులు,దళిత సంఘాలు,ప్రజా సంఘాలు,వివిధ పార్టీల నాయకులు, అభిమానులు సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు జాయింట్ యాక్షన్ కమిటీ తెలిపారు.

## ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిపాటి

**గోపాలపురం, పెన్ పవర్, మార్చి 30:**గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు రాజమహేంద్రవరంలో ఆదివారం జరిగిన ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో ఎస్వీ ఫంక్షన్ హాల్ లో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మద్దిపాటి అక్కడ జరిగిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొని నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని,తెలుగు వారి యొక్క సంప్రదాయాలను తెలియజేసేదే ఉగాది అని మన పూర్వికుల నుండి నేటి వరకు అంతా ఎంతో భక్తి శ్రద్ధలతో ఉగాది పండుగను జరుపుకోవడం ఆనందదాయకం అన్నారు. మన జీవితంలో ఎదురయ్యే సుఖదుఃఖాల్లో భాగంగా ఉగాది రోజున షడ్రుచులతో కలిసిన ఉగాది పచ్చడిని ప్రతి ఒక్కరూ తిని తరిస్తారన్నారు. కార్యక్రమం అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలో అందించిన 110 మంది ప్రముఖులను ఘనంగా సత్కరించారు. గోపాలపురం నియోజకవర్గం లోని ద్వారకాతిరుమల మండలం నుండి ఆకుల అమ్మన్న రాజు, ఎస్.కె నాజర్ వల్లిలు ఈ సత్కారం పొందిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, జాతీయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర రాజు, రాజానగరం, రాజమండ్రి రూరల్, అనపర్తి, గోపాలపురం శాసనసభ్యులు భక్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చి చౌదరి,నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్ రాజు తదితర అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

బిజెపి జిల్లా అధ్యక్షుడు బిక్కిన.



**కాకినాడ.పెన్ పవర్ మార్చి 30 :**కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా ప్రయోజన పథకాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బిజెపి కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు సూచించారు. ఆదివారం స్థానిక జిల్లా బిజెపి కార్యాలయంలో కాకినాడ రూరల్ మండలం బిజెపి సీనియర్ నాయకులు,జిఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత గీసాల శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వ పథకాలతో ప్రత్యేకంగా రూపొందించిన క్యాలెండర్ను విశ్వేశ్వరరావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంబంధించిన ప్రయోజనకరమైన పథకాలను రూపొందించడం జరిగిందని అన్నారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఈ పథకాలు చేకూరాలంటే దీనిపై వారికి పూర్తి అవగాహన కల్పించవలసిన బాధ్యత ప్రతి బిజెపి కార్యకర్తపై ఉందని స్పష్టం చేశారు.ఈ క్యాలెండర్ను రూపొందించిన గీసాల శ్రీనివాసరావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా గంగనాపల్లి పంచాయతీ వర్క్స్ కమిటీ చైర్మన్ గీసాల మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతున్నప్పటికీ ప్రజలకందుతున్న పథకాలను ఇవి కేంద్ర బిజెపి ప్రభుత్వం అందజేసే పథకాలని వివరించడంలో మరింత శ్రద్ధ వహించవలసిన అవసరం ఉందని అన్నారు. అలాగే మరికొన్ని పథకాలపై ప్రజలకు పూర్తి అవగాహన లేక అనేకమంది అవకాశాలను అందిపుచ్చుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని తాను కేంద్ర ప్రభుత్వ పథకాలపై కేలండర్ రూపొందించడం జరిగిందని తెలిపారు.భవిష్యత్తులో ఈ పథకాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజలకు అవగాహన కలిగించే విధంగా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం సమావేశానికి వెళుతున్న గోపాలపురం వాసులు



**గోపాలపురం,పెన్ పవర్, మార్చి 30:**అమరావతిలో ఆదివారం సాయంత్రం జరిగిన పి4 సమావేశానికి గోపాలపురం నుండి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. వివిధ శాఖలకు చెందిన సిబ్బంది వెళ్తున్న ఈ వాహనాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద తహసిల్దార్ అజయ్ బాబు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ లు జెండా ఊపి ప్రారంభించారు. పి4 సమావేశం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్రంలోని మంత్రులు ప్రముఖులు హాజరవనున్నారు. పేదరిక నిర్మూలన, ధనిక పేదల మధ్య అసమానతలను తొలగించడం ఈ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వం, ప్రవేటు భాగస్వామ్యంతో దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వారిని గుర్తించి వారిని అభివృద్ధి పరచడం. పెద్దలు, పేదలు ఒకే వేదికపై ఉండడం పెద్దల సహకారంతో పేదల యొక్క ఆర్థిక స్థితిగతులను మార్చడం, వారు ఆర్థిక పురోభివృద్ధి సాధించడం వంటివి ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సమావేశానికి మండలం నుండి వివిధ శాఖలకు చెందిన సిబ్బంది తరలి వెళ్లారు.

# స్వామి ప్రసాద్ కు ఉగాది పురస్కారం.

**మండపేట. పెన్ పవర్.మార్చ్ 30:**మండపేట మండలం ద్వార పూడి పాఠశాల ఉపాధ్యాయులు, జేగురుపాడు కు చెందిన అభ్యుదయ సాహితీవేత్త అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గండి స్వామి ప్రసాద్ శ్రీ విశ్వా వసునామ ఉగాది వేడుకలు సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో రాజమండ్రి ఆనం కళా కేంద్రంలో పురస్కారాన్ని అందుకున్నారు. ఉగాది వేడుకలలో జిల్లా కలెక్టర్ జిల్లా సాంస్కృతిక మండలి అధ్యక్షురాలు పి. ప్రశాంతి, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు ,అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లు ఈ పురస్కారాన్ని స్వీకరించినట్లు స్వామి ప్రసాద్ తెలియజేశారు. ప్రసాద్ కవితలు, సామాజిక వ్యాసాల ద్వారా చేస్తున్న సాహితీ సేవలను గుర్తించి జిల్లా సాంస్కృతిక మండలి పురస్కారాన్ని అందజేసి శాలువా తో సత్కరించడం పట్ల జేగురుపాడు సర్పంచ్ యాదాల సతీష్ చంద్ర స్టాలిన్, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్ ,అభ్యుదయ రచయితల సంఘం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ, రచయితల సమితి జిల్లా కార్యదర్శి బి. హెచ్.పి.వి రమాదేవి తదితరులు అభినందనలు తెలియజేశారు.



# రంజాన్ నేర్పే పాఠం.

- సమాజానికి ఆదర్శం.
- చైర్ పర్సన్ రాణి.



**మండపేట. పెన్ పవర్.మార్చ్ 30:**ముస్లిం సోదర సోదరీమణులకు మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణీ ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం రంజాన్ పండుగ ను నిర్వహించుకునే ముస్లిం లకు తన శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షల ద్వారా పరిఢవిల్లిన క్రమశిక్షణ, సహోదరత్వం, దాతృత్వం, దైవభక్తి, ఆధ్యాత్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసమని మున్సిపల్ చైర్పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు.ఈద్ ఉల్ ఫితర్ పర్వదిన వేడుకలను కుటుంబ సభ్యులు,బంధు, మిత్రులందరితో కలిసి సంతోషంగా జరుపుకోవాలని ఆమె కోరుకున్నారు. పట్టణ ప్రజలందరు సుభీక్షంగా సంపూర్ణ ఆరోగ్యంతో కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లాహ్ ఆశీర్వాదాలు అందాలని ఆమె ప్రార్థించారు. రంజాన్ మాసం లో ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిం లు ఏడాదంతా అల్లాహ్ ఆదేశాలను పాటించి ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు.

## కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో.ఉగాది వేడుకలు.



**మండపేట. పెన్ పవర్.మార్చ్30:**మండపేట పట్టణంలో కమ్మ మహాజన సంఘం కార్యాలయం వద్ద ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది వేడుకల్లో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే తెలుగు నూతన సంవత్సర పంచాగాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ విశ్వావసు నామ సంవత్సరంలో ప్రతీ ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతున్ని కోరుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, మల్లిపూడి గణేష్, సంఘం కార్యదర్శి వల్లూరి చిన్నారావు, వల్లూరి విజయానంద పార్థసారధి, రెడ్డి పుల్లాజి, తదితర్లు పాల్గొన్నారు.

# అంగర నూకలమ్మ జాతర.



**మండపేట.పెన్ పవర్.మార్చి 30 :**కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో శ్రీ నూకాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు నూకాలమ్మ అమ్మవార్ని దర్శించుకున్నారు. ఈ సంధర్బంగా ఎమ్మెల్యే అమ్మవార్కి చీర, పూలు, పండ్లు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుత్సల శ్రీనివాస్, బొల్లోజు నాని, త్రిపురశెట్టి నాని, మచ్చా గంగరాజు, ప్రతాప్ చౌదరి, గంద్రోతుల పట్టాభి, బసవరాజు, దానేటి శరత్, యడ్లపల్లి సీతారాం, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితర్లు పాల్గొన్నారు.

**పెన్ పవర్.మార్చ్ 30**గోపాలపురంలోని బాపూజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉగాది సంబరాలు అంబరాన్ని అంటాయి. పాఠశాల కరస్పాండెంట్ గూడూరు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాలు తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా జరిగాయి. ముందుగా పాఠశాల ప్రాంగణాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. విద్యార్థులు వివిధ వేషధారణలో కార్యక్రమానికి హాజరయ్యారు. తెలుగువారి సాంప్రదాయ ఉట్టి పడేలాగా జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ రకాల వేషధారణలతో చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉగాది పండుగకు ముఖ్యమైన ఉగాది పచ్చడి, గారెలు వంటివి పాఠశాల ఆవరణలో తయారుచేసి విద్యార్థులకు పంచిపెట్టారు. షడ్రుచులతో కలిగిన పచ్చడిని విద్యార్థులు సేవించారు. శ్రీ విశ్వ వాసు నామ



సంవత్సరం అందరి కుటుంబాలలో సుఖసంతోషాలు పెంచాలని వెంకటేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశ్రీ,ఉపాధ్యాయులు శ్రీవిద్య, కనకదుర్గ, రేవతి, అనూష ,స్వప్న ,సునీత, చంద్రకళ,లలిత,చంద్రలేఖ, విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 30**: మండల కేంద్రమైన కిర్లంపూడి లో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో ఉగాది పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితులు వర్జుల సత్తిపండు పంచాంగ శ్రవణాన్ని భక్తులకు వివరించారు.విశ్వా వసు నామ సంవత్సరంలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని, వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మళ్ల నాగు, యల్లపు నానాజీ, దాడి పెద్ద బుజ్జి, లంక మూర్తి,నాగబాబు సన్నిహితులు ఉన్నారు.

## మలబార్ గోల్డ్ ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థినులు నాగవేణి

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి30.**

మహిళా విద్యను ప్రోత్సహించాలనే సదుద్దేశంతోమలబార్ గోల్డ్, డైమండ్స్ అందిస్తున్న ఉపకార వేతనాలకు తాడేపల్లిగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధాన అధ్యాపకురాలు పి నాగవేణి తెలిపారు. ఇంటర్మీడియట్ లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు మలబార్ గోల్డ్, డైమండ్ సంస్థ ప్రతి ఏటా ఉపకార వేతనాలను అందిస్తుందన్నారు. అందులో భాగంగా తమ కళాశాల నుండి ఈ ఏడాది పదిమంది విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు ఎంపికయ్యారన్నారు. భీమవరం మలబార్ గోల్డ్, ,డైమండ్ షోరూం వద్ద డైరెక్టర్ ఇంతియాజ్ అధ్యక్షతన శనివారం కార్యక్రమం ఏర్పాటు చేశారు అన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భీమవరం శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు చేతుల మీదుగా ఈ ప్రోత్సాహక బహుమతులను విద్యార్థులకు అందజేశారన్నారు.



కళాశాల కి చెందిన పౌర శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ నాగార్జున పర్యవేక్షణలో విద్యార్థినులు వి శ్రీలత, జి ప్రవళిక, ఏ సత్య స్వరూప, పీ ప్రవళిక, జీకే ఎం ఎల్ శేషమని, ఎల్ మహాలక్ష్మి, పి దివ్యసత్య స్వరూప, ఎస్ శ్రావణి, టి రామలక్ష్మీ దుర్గ లు ఈ నగదు బహుమతులను అందుకున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించిన అధ్యాపక బృందానికి, విద్యార్థులకు ప్రధాన అధ్యాపకురాలు నాగవేణి అభినందనలు తెలిపారు.

# నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

**ఆలమూరు, పెన్ పవర్,మార్చి 30:**ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలలో ప్రఖ్యాతిగాంచిన ఆలమూరు మండలంలోని చింతలూరు గ్రామంలో వేంచేసిఉన్న శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు, కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాసు కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.మూడవరోజు అయిన ఆదివారం ఉగాది కావడంతో భక్తజనం పోటెత్తారు. ఉదయం నుండి అమ్మవారికి మొక్కలు తీర్చుకునేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా పోలీస్ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేదపండితుల ఆశీర్వాచనాల మధ్య పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వాదం అందజేశారు. అనంతరం ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి వారిని ఘనంగా సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## శ్రీ శ్రీ కళావేదిక అల్లూరి శాఖ ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం



**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి 30**

అంతర్జాతీయ సాహితీ సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక అల్లూరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉగాది కవిసమ్మేళనం ఏర్పాటు చేసినట్లు అల్లూరి జిల్లా అధ్యక్షులు మన్యం కవి నూనె రమేష్ తెలిపారు.స్థానిక ఎ.ఎస్.డి.ఎస్.సంస్థ కార్యాలయం ప్రాంగణంలో ఆదివారం కవి సమ్మేళనంలో ఎ.ఎస్.డి.ఎస్.స్థాపకులు ఉండవల్లి గాంధీ బాబు పాల్గొని సాహిత్యం కళలు సమాజ బాగుకోసం కృషి చేయాలని అన్నారు.కళల ద్వారానే సమాజంలో మార్పు తీసుకురావొచ్చు అన్నారు. స్థానిక రచయిత మాజీ జడ్.పి టి.సి.ముత్యాల రామారావు సాహిత్యం సమాజం పై చూపించే ప్రభావాలను వివరించి,రచయితకు ఉండవలసిన లక్షణాలు,రచయితలు కవులు సామాజిక బాధ్యతను వివరించారు.స్థానిక కవి కోట్ల నరేష్ బాబు ఉగాది విశిష్టతపై ఉగాది పర్వదినం అనే కవిత చదివి వినిపించారు.మరొక కవి బొర్రా శివ ప్రసాద్ఉగాది విశిష్టత ఉగాది సంప్రదాయాలపై కవిత వినిపించారు. నిర్వాహకులు మన్యం కవినూనె రమేష్ మాట్లాడుతూ కవిత్వం సామాజిక బాధ్యత అన్నారు.శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ సాహితీ సంస్థ,డాక్టర్ కత్తిమ ప్రతాప్, స్థాపించి దేశ విదేశాల్లో సాహిత్య సేవలు చేస్తున్నారన్నారు.కొల్లి రామావతి నేతృత్వంలో అంతర్జాతీయ సమన్వయ కర్తగా సంస్థను నడిపిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమం లో పలువురు కవులు సాహితీ అభిలాక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కారాన్ని అందుకున్న సుబ్బారెడ్డి...



**అనపర్తి పెన్ పవర్ మార్చి 30 :**అనపర్తి శ్రీరామ కృష్ణ సేవ సమితి ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి ‘ ఆంధ్ర రాష్ట్ర ఉగాది పురస్కారం”
అందుకున్నారు. విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీరుగా సుబ్బారెడ్డిని జ్ఞాపికతో సత్కరించారు. సమితి ప్రధాన కార్యదర్శిగా సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సమాజానికి
సేవలు అందిస్తున్న వారిని గుర్తించి పురస్కారాలతో సత్కరించడం ద్వారా మరింత మంది స్ఫూర్తిని
అన్నారు. పురస్కార ప్రవేత నల్లమిల్లి సూబ్బా రెడ్డికి రాజమండ్రి రామకృష్ణ మఠం అద్యక్షులు స్వామి పరిజ్ఞేయానంద జీ
మహరాజ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డా. సత్తి సూర్యనారాయణ ఆర్ట్స్, సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, ప్రముఖ హైకోర్టు సీనియర్ న్యాయ వాది నల్లమల్లి శివారెడ్డి, ఎంపీడీవో మండ రామకృష్ణా రెడ్డి, రామకృష్ణ మిషన్ సభ్యుడు దుర్గా ప్రసాద్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే ,రవికుమార్ ని సన్మానించిన ఆర్యవైశ్యులు



**జీలుగుమిల్లి, పెన్ పవర్, మార్చి 30 :**తెలుగు కొత్త సంవత్సరంలో అందరూ బాగుండాలి మరెన్నో ఆరోగ్యకరమైన పండుగలు అందరం కలిసికట్టుగా జరుపుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిరి బాలరాజు అన్నారు. ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకొని ఆర్యవైశ్యులు నిర్మాణంలో ఉన్న శివాలయం వద్ద ఎమ్మెల్యేని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం వందమంది ఆర్యవైశ్య కుటుంబీకులు జనసేన పార్టీలో చేరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, ఆర్య వైశ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కోడిపందాలపై దాడి

**టీ నర్సాపురం, పెన్ పవర్, మార్చ్30:**మధ్యాహ్నపు వారి గూడెం గ్రామ శివారులో ఆదివారం కోడిపందాలు నిర్వహిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడిపందాలు ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జయ బాబు తెలిపారు. వారి వద్ద నుండి 2,300 రూపాయలు నగదుతో ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో టీ నర్సాపురం ఎస్ఐ జయ బాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు అని తెలిపారు.

# శ్రీకృష్ణదేవరాయులు.. జగన్.. ఇద్దరికి లింకు.. వైసీపీ ఉగాది పంచాంగం




**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ ఉగాది పంచాంగ శ్రవణం వేడుకగా జరిగింది. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ ఉత్సవాల్లో ప్రముఖ అవధాని నారాయణమూర్తి పంచాంగ శ్రవణం పఠనం చేశారు. వైసీపీ అధినేత జగన్ మిథునరాశిలో జన్మించారని, ఆ రాశి వారికి భయం అంటూ ఏంటో తెలియదని చెప్పారు. అందుకే గత ఎన్నికల్లో ఓడినా జగన్ భయపడకుండా ప్రభుత్వంపై పోరాడుతున్నారని సూత్రీకరించారు.ప్రజల కోసం వైసీపీ అధినేత ఎంతో ధైర్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. మిథునరాశి వారి ఈ సంవత్సరం అనుకూలంగా ఉంటుందని చెప్పారు. అదేవిధంగా విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయులు మాదిరిగా జగన్ కూడా చరిత్రలో నిలిచిపోతారని తెలిపారు. 2019 ఎన్నికల్లో మాదిరిగా జగన్ త్వరలోనే మరోసారి విజయదుందుభి మోగిస్తారని పంచాంగకర్త తెలిపారు. ఆవేశంలో ప్రజలు గత ఎన్నికల్లో తప్పులు చేశారని, ఇప్పుడు చింతిస్తున్నారని పంచాంగకర్త చెప్పడం గమనార్హం.అయితే, ఈ కార్యక్రమంలో జగన్ కానీ, ఆయన సతీమణి భారతి కానీ హాజరుకాకపోవడంపై చర్చ జరుగుతోంది. అదేవిధంగా తాడేపల్లి కార్యాలయంలోని పార్టీ పెద్దలు కూడా ఎవరూ కనిపించలేదు. విజయవాడ నగర మేయర్ సహా కొందరు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొనడం గమనార్హం. వైసీపీ పంచాంగపై నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఇది ఉగాది పంచాంగం కాదు వైసీపీ పంచాంగమంటూ ట్రోల్ చేస్తున్నారు.

# జమిలి ఎన్నికలకు కారణం కాంగ్రెస్ పార్టీయేనా?




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో ఇప్పుడు ఎక్కడ విన్నా జమిలి ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. కేంద్రంలోని అధికార బీజేపీ ఈ దిశగా పకడ్బందీగా పావులు కదుపుతోంది. మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ కమిటీ ద్వారా నివేదిక తెప్పించుకుంది. ఇక బీజేపీ అనుకూల పార్టీలు జమిలికి అనుకూలంగా ప్రకటనలు చేస్తుండగా, విపక్ష శిబిరం ఇండి కూటమి బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. జమిలి ఎన్నికలను అంగీకరించమంటూ తేల్చిచెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం జమిలి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. అయితే జమిలి ఎన్నికలపై మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు.దేశంలో జమిలి ఎన్నికలు కొత్త కాదన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రస్తుతం ఈ పరిస్థితి రావడానికి కాంగ్రెస్ పార్టీనే కారణమంటూ ఆరోపించారు. జమిలి ఎన్నికలకు తూట్లు పొడిచిన కాంగ్రెస్ ఇప్పుడు జమిలి ప్రతిపాదనకు వ్యతిరేకంగా సాగుతోందని ఆక్షేపించారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక ప్రాముఖ్యత - సవాళ్లు - ప్రభావం పేరిట విజయవాడలో శనివారం నిర్వహించిన కీలక సదస్సులో వెంకయ్య ప్రసంగించారు. స్వతంత్ర భారతదేశంలో తొలి ఎన్నికలు 1952లో జరిగాయని ఆయన గుర్తు చేశారు. నాడు పార్లమెంటు ఎన్నికలతోపాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి అంటే మనం ఇప్పుడు చెప్పుకుంటున్న జమిలి ఎన్నికలే జరిగాయని ఆయన తెలిపారు. అప్పటి నుంచి 15 ఏళ్లపాటు అంటే 1952 ఎన్నికలతో కలుపుకుంటే 4 సార్వత్రిక ఎన్నికలు జమిలి పద్ధతిలోనే జరిగాయని ఆయన గుర్తు చేశారు.అయితే నాడు దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ నేత ఇందిరా గాంధీ దేశంలోని పలు రాష్ట్రాల్లో కొనసాగుతున్న ప్రభుత్వాల్లో తనకు నచ్చని ప్రభుత్వాలను నిర్ణీత కాలం కంటే ముందుగానే రద్దు చేసుకుంటూ వెళ్లిపోయారని వెంకయ్య ఆరోపించారు. అలా ప్రభుత్వాలు రద్దు అయిపోయిన రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికలకు ముందే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చిందన్నారు. వెరసి జమిలి అనేది కొత్త పద్ధతి కాదన్న వెంకయ్య దేశంలో ఆది నుంచి అదే పద్ధతి కొనసాగిందని గుర్తు చేశారు. నాడు జమిలి ఎన్నికల పద్ధతికి తూట్లు పొడిచింది కాంగ్రెస్సేనని ఆరోపించిన వెంకయ్య ఇప్పుడు అదే పద్ధతి తీసుకొస్తామంటే అదే పార్టీ అడ్డుకుంటూ ఉండటం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# టీడీపీకి ఊపు తెస్తున్న యువ మంత్రి.. గజపతినగరంలో పసుపు జెండా రెపరెపలు

**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీ ఆవిర్భావ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి నిర్వహించిన వేడుకల కోసం టీడీపీ నేతలు పోటీపడ్డారు. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాలకు ప్రాధాన్యమివ్వాలని పార్టీ హైకమాండ్ ఆదేశాలు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటివాటితో టీడీపీ కేడర్ లో జోష్ నింపింది. దీంతో అటు సిక్కోలు నుంచి ఇటు చిత్తూరు వరకు పెద్ద ఎత్తున పార్టీ ఆవిర్భావ పండగను నిర్వహించారు. ఎమ్మెల్యేలు, మంత్రులు పర్యవేక్షణలో ఎక్కడిక్కడ కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఇక విజయనగరం జిల్లాలోనూ యువ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ ఆవిర్భావ కార్యక్రమాలు జరిగాయి. గత ఎన్నికల్లో జిల్లాను క్లీన్ స్వీప్ చేసిన టీడీపీ కూటమి మరింత బలపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా మంత్రి శ్రీనివాస్ కార్యకర్తలకు అందుబాటులో ఉంటుండటంతో ఈ సారి పార్టీ ఆవిర్భావ వేడుకలకు చాలా మంది హాజరయ్యేలా ఉపయోగపడింది. పార్టీ కార్యక్రమాలకు చాలా కాలంగా దూరంగా ఉన్నవారు సైతం మంత్రి పనితీరును మెచ్చి ముందువరుసలో నిల్చొని పార్టీ వేడుకలను నిర్వహించారు.
మంత్రి శ్రీనివాస్ సొంత నియోజకవర్గం గజపతినగరంలో అయితే సంబరాలు అంబరాన్ని తాకాయి. సేవా కార్యక్రమాలు, రక్తదాన శిభిరాలు, సామూహిక అన్నదాన కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు.గజపతినగరంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో పాటుగా పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. పార్టీ నేతలతో స్వయంగా మాట్లాడిన మంత్రి.. దిశా నిర్దేశం చేస్తూ, గ్రామ స్థాయిలో కార్యక్రమాలను ముందుండి నడిపించారు. మంత్రి పిలుపుతో పాటుగా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన కార్యకర్తలు.. నాయకత్వం కొన్ని గ్రామాల్లో ముందస్తు షెడ్యూల్ కారణంగా అందుబాటులో లేకపోయినా, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఆవిష్కరణ కార్యక్రమాలను నిర్వహించారు.తాను హాజరు కాలేకపోయిన కార్యక్రమాలను నిర్వహించిన కార్యకర్తలతో, నాయకులతో స్వయంగా ఫోన్ లో మాట్లాడిన మంత్రి, పలువురిని అభినందించారు. పార్టీ కార్యక్రమాలకు ఈ మధ్య దూరంగా ఉన్న నాయకులు కూడా మంత్రి పిలుపుతో ముందుకు వచ్చారు. ఇక ఉత్తరాంధ్రలో ఇతర నాయకులు సైతం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మారుమూల పల్లెల్లో సైతం పెద్ద ఎత్తున కార్యకర్తలు ఓ పండుగగా ఆవిర్భావ వేడుకలను నిర్వహించడం గమనార్హం. ఇక పార్టీ జాతీయ కార్యాలయంలో సైతం వేడుకలను ఘనంగా నిర్వహించింది అధిష్టానం.

# చంద్రబాబుకు ఎదురులేదు.. అమరావతికి తిరుగులేదు..

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉగాది పంచాంగ శ్రవణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అధికారికంగా ఉగాది ఆస్థానాన్ని ఏర్పాటు చేశారు. ప్రముఖ పంచాగకర్త మాడుగుల నాగఫణిశర్మ భవిష్యవాణిని వినిపించారు. నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతికి ఇకపై ఎలాంటి ముప్పు వాటిల్లే అవకాశమే లేదని, అమరావతిని ఏపీకి రాజధాని ఎంపిక చేసిన టీడీపీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబుకు తిరుగులేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మరో రెండుసార్లు నిరాటంకంగా కొనసాగుతారని జోస్యం చెప్పారు. చంద్రబాబును నమ్ముకున్న వారందరికీ న్యాయం జరుగుతుందని, పదవులు దక్కని వారందరికీ మంచి పదవులు వస్తామయని చెప్పారు.ప్రభుత్వం తరఫున నిర్వహించిన ఈ కార్యక్రమంలో పంచాంగ కర్త నాగఫణిశర్మ రాజధాని అమరావతిపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు ఆగుతూ, సాగుతూ ఉన్న అమరావతి నిర్మాణ పనులు ఇక వాయువేగం అందుకుంటాయని జోస్యం చెప్పారు. నిర్ణీత కాలంలోనే రాజధాని అమరావతి పూర్తవుతుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో అద్భుతమైన విశ్వనగరం నిర్మితమవుతుందని వ్యాఖ్యానించారు.
సీఎం చంద్రబాబు భవిష్యత్తు గురించి ప్రస్తావించిన శర్మ మరో పది, పదిహేనేళ్ల వరకు ఆయన అధికారానికి ఢోకా లేదని తెలిపారు. ఇప్పటికే నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఐదు, ఆరోసారీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపడతారని ఆయన సెలవిచ్చారు. వెరసి మరో పదిహేనేళ్ల దాకా చంద్రబాబు అధికారంలోనే కొనసాగుతారని ఆయన తెలిపారు. ఇక



టీడీపీ నేతలు, కూటమి పార్టీల నేతల విషయాన్ని ప్రస్తావించిన శర్మ పదవులు రాలేదని బాధ పడాల్సిన అవసరం లేదని నేతలకు సూచించారు. అర్హత ఉన్న నేతలకు కాస్తంత ఆలస్యమైనా వారి అర్హతల మేరకు పదవులు దక్కుతాయని తెలిపారు.

# బాబు కొత్త నినాదం...కుదరదంటున్న వెంకయ్యనాయుడు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ సీఎం చంద్రబాబు ఇటీవల ఒక కొత్త నినాదాన్ని తీసుకున్నారు. ఆయన ఏ వేదిక ఎక్కినా అదే ధాటీగా వినిపిస్తున్నారు. పైగా అలా చేయాల్సిందే అని కూడా ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఇంతకీ బాబు కొత్త నినాదం ఏమిటి అంటే అధికంగా పిల్లలను కనడం.
ఒకనాడు పిల్లలు అన్నది దేశానికి భారమని భావించేవారు. కానీ ఇపుడు భారం ఎంతమాత్రం కాదని అదే దేశానికి అతి పెద్ద అడ్వాంటేజ్ అని బాబు చెబుతున్నారు. ప్రపంచంలోని అనేక దేశాలలో జనాభా బాగా తగ్గిపోతోందని ఆయన గుర్తు చేస్తున్నారు.
ఈ సమయంలో భారత్ కనుక జనాభా పెంచుకుంటే కనుక కచ్చితంగా ఆ ఫలాలు ఫలితాలు భారత్ కి దక్కుతాయని ఆయన అంటున్నారు. ప్రతీ ఒక్కరూ కనీసంగా ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలను కనాలని బాబు పిలుపు ఇస్తున్నారు. తాజాగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలోనూ బాబు అదే మాట చెప్పారు.
దంపతులు ఎక్కువ మంది పిల్లలు కనాలని ఆ విధంగా వారిని అవగాహన కల్పించేలా పార్టీ క్యాడర్ కూడా చర్యలు తీసుకోవాలని బాబు కోరారు ఇక చెన్నైలో జరిగిన మద్రాస్ ఐఐటీ సదస్సులో కూడా యంగ్ స్టర్స్ ని ఉద్దేశించి బాబు మాట్లాడినపుడు ఇదే విధంగా సూచించారు.ఎక్కువ మంది పిల్లలను కనండి అని ఆయన వారికి చెప్పారు ఉత్తరాది రాష్ట్రాలు ఈ విషయంలో ముందు ఉంటే దక్షిణాది వెనకబడిపోయిందని బాబు అన్నారు. సంతానోత్పత్తి దక్షిణాదిన తగ్గిపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేయడాన్ని అంతా చూశారు.
అయితే బాబు అన్న దానికి పూర్తి విరుద్ధమైన భావాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు ప్రకటించారు. ఆయన తాజాగా మీడియాతో మాట్లాడుతూ ఈ మధ్య కొంతమంది ఎక్కువ మంది పిల్లలను కనమని చెబుతున్నారని పరోక్షంగా బాబు తమిళనాడు సీఎం స్టాలిన్ నినాదాన్ని ప్రస్తావించారు. అయితే అది దేశానికి ఏమంత మంచిది కాదని ఆయన అన్నారు.
ఎక్కువ మంది పిల్లలు ఉంటే ఎక్కువ సీట్లు వస్తాయని రాజకీయంగా లాభమని చూసుకోవడం మంచిది కాదని ఆయన అన్నారు. ఎక్కువ మంది పిల్లలు ఉంటే జనాభా అధికం అయితే వారందరికీ వనరులు అందుబాటులోకి తేగలమా అని ఆలోచించాలని ఆయన అన్నారు. ఇపుడు ఉన్న
వారికే వనరులు అందడం లేదని ఆయన చెప్పుకొచ్చారు.అందువల్ల పాలకులు ఇపుడు ఉన్న వారికి అన్ని విధాలుగా వనరులు అందేలా చూసి వారు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని సలహా ఇచ్చారు. అంతే తప్ప ఎక్కువ మంది సంతానాన్ని పెంచుకుంటే అందరికీ ఏమీ చేయకపోతే ఇబ్బందులే వస్తాయని ఆయన తన అనుభవ సారాన్ని క్రోడీకరించి చెప్పారు.
ఎక్కువ మంది పిల్లలను కనమని కేవలం బాబు మాత్రమే అనడంలేదు. తమిళనాడు సీఎం స్టాలిన్ ఇదే మాట అంటున్నారు. ఆయన అయితే ఏకంగా పదహారు మంది పిల్లలను దంపతులు కనాలని కూడా చెబుతున్నారు ఈ తరహా నినాదాలు విధానాలు దేశ హితానికి మేలు చేయవని మరో వైపు నిపుణులు కూడా చెబుతున్నారు. ఇపుడు ఉన్న నీరు భూమి కూడా జనాభా అధికం అవుతూండడంతో సరిపోవడం లేదు. 2050 నాటికి ప్రతీ ఒక్కరి అవసరాలకు సరిపడా నీరు అందదని మేధావులు అంటున్నారు. మరి ఉన్న వారికే ఏమీ లేకపోతే కొత్తగా పుట్టుకుని వచ్చే వారికి ఏమి ఇస్తారు అన్న ప్రశ్నలు ఉన్నాయి.అయినా అధిక జనాభాతో అధిక పేదరికంతోనూ ఉత్తరాది రాష్ట్రాలు ఉన్నాయన్న సంగతిని విస్మరిస్తే ఎలా అని సూచనలు అందుతున్నాయి. ఇవన్నీ చూస్తుంటే ఎక్కువ మంది పిల్లలను కనాలన్న నినాదం బూమరాంగ్ అయ్యేలా ఉందనే అంటున్నారు. అసలా మాటకు వస్తే ఈనాటి యువతకు పెళ్ళి మీదనే ఆసక్తి లేకుండా పోతున్న వేళ ఇక సంసారం అధిక సంతానం అంటే వారి బుర్రలకు ఎక్కుతాయా అన్నది కూడా మరో వాదన ఉంది.

# పసి రాజా...నిక్కర్ మంత్రి...అంతేనా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** టీడీపీకి ఆయన భావి నాయకుడు. చంద్రబాబు తరువాత అంతటి వారు. ఒక విధంగా చెప్పాలీ అంటే తెలుగుదేశం ఇపుడు ఆయన పర్యవేక్షణలోనే ఎక్కువగా ఉంది అని అంటారు. ఇక చంద్రబాబు కూడా ఈ అయిదేళ్ళ కాలాన్ని తన కుమారుడి రాజకీయ భవిష్యత్తును భద్రంగా తీర్చిదిద్దడానికి ఎక్కువగా ఉపయోగించుకుంటారు అని కూడా ప్రచారం సాగుతోంది.
ఎవరు అవునన్నా కాదన్నా టీడీపీకి బాబు తరువాత లోకేష్ అన్నది వాస్తవం. ఇక లోకేష్ కి టీడీపీలో పోటీ ఎవరూ లేరు. ఆయనతోనే పార్టీ ఉండాలి ఉంటుంది. తెలుగుదేశం పార్టీకి కట్టుబడి పోయిన ఫార్టీ పెర్సెంట్ ఓటు బ్యాంక్ ఎపుడూ కచ్చితంగా ఉంటుంది. ఆ మీదట పాజిటివ్ వేవ్స్ ని క్రియేట్ చేసుకుంటే అధికారం దఖలు పడుతుంది.తెలుగుదేశం పార్టీలో చూసుకుంటే ఏడున్నర పదుల చంద్రబాబు పొలిటికల్ గా రిటైర్ అయితే అందుకోవాల్సింది లోకేష్ అన్నది పార్టీలో మొత్తానికి తెలుసు. ఇక తెలుగుదేశం పార్టీలో యువతకు జూనియర్ లీడర్స్ కి పెద్ద పీట వేస్తున్నారు. వీరంతా రేపటి రోజున లోకేష్ కి అండగా ఉంటారు అన్నది వేరేగా చెప్పాల్సింది లేదు.ఈ క్రమంలో లోకేష్ ని గతంలో పప్పు అని ప్రత్యర్థి పార్టీలు సెటైర్లు వేసి ర్యాగింగ్ చేసినా ఆయన బాగానే మెరుగు పడ్డారనే అంటారు. ఆయన 2017 నుంచి 2019 దాకా మంత్రిగా పనిచేసినపుడు సోషల్ మీడియాలో ఆయన మీద ఎక్కువగా ట్రోల్స్ వచ్చేవి. ఇపుడు మాత్రం లోకేష్ బాగానే మాట్లాడుతున్నారు.
ఆయన మాటల వెనక పంచులు కూడా బాగా పేలుతున్నాయి. అవి వైసీపీని గట్టిగానే గుచ్చుకుంటున్నాయి. చిత్రమేంటి అంటే వైసీపీని అవి ఎంతగా మండిస్తున్నా లోకేష్ ని మాత్రం ఒకనాటి పప్పుగా చూడలేకపోతున్నాయి. ఆయన్ని పట్టుకుని అదే రకమైన ర్యాగింగ్ అయితే చేయలేకపోతున్నాయి.అదే సమయంలో లోకేష్ తమకు సమవుజ్జీ అని చెప్పలేక ఒప్పుకోలేక సతమతమవుతున్నాయి. నిజానికి పార్టీలో లోకేష్ ప్రాబల్యం సీనియర్లకే కొంత ఇబ్బందిగా ఉందని అంటున్నారు. వారిని పక్కన పెట్టి జూనియర్లకు పెద్ద పీట వేయడం అంతగా నచ్చడం లేదు అని అంటున్నారు.
ఇక మిత్ర పక్షాలు సైతం చంద్రబాబుతోనే మా పొత్తులు అన్నట్లుగానే వ్యవహరిస్తున్నాయి. బాబు పదిహేనేళ్ల పాటు అధికారంలో ఉండాలని పదే పదే కోరడం వెనక కూడా ఈ తరహా ఆలోచనలు ఉన్నాయని ప్రచారంలో ఉంది. బాబుతో అయితే కలసి పనిచేయడానికి అభ్యంతరం ఉండదు కానీ లోకేష్ అయితే లెక్కలు మారుతాయనే అంటున్నారు.



ఇంకో వైపు చూస్తే ప్రత్యర్థి వైసీపీ కూడా లోకేష్ దూకుడుని ఆయన ప్రాముఖ్యతను తట్టుకోలేకపోతోంది అని అంటున్నారు. అందుకే ఆయనకు నిక్కర్ మంత్రి అని నామధేయం పెట్టి ఆ విధంగా ర్యాగింగ్ చేస్తోంది. అంటే ఆయనకు ఏమీ తెలియదు అన్నదే ఆ పేరు పెట్టడం వెనక ఉన్న భావన అన్న మాట.కీలకమైన మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తూ రెండు సార్లు మంత్రిగా ఉన్న లోకేష్ నిక్కర్ మంత్రి ఎలా అవుతారు అన్నది మాత్రం అర్థం కాదని అంటున్నారు. కానీ వైసీపీ నుంచి అలాంటి పిలుపులే వస్తున్నాయని అంటున్నారు. ఇక తాజాగా లోకేష్ ని పూర్తిగా పసివాడి కిందకే జమ కట్టేశారు.
లోకేష్ టీడీపీ ఆవిర్భావ దినోత్సవ సభలో మాట్లాడుతూ రెడ్ బుక్ అంటే కొందరికి గుండె పోటు వస్తోందని వ్యాఖ్యానించారు. అర్థమైందా రాజా అని ఆయన వైసీపీ నేతల మీద కామెంట్స్ చేశారు. దాని మీద వైసీపీ సీనియర్ నేత మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ లోకేష్ ని పసి రాజా అని సంబోధించారు. లోకేష్ ని రాజకీయంగా ఇంకా పసివాడి కిందనే వైసీపీ చూస్తోంది అన్నది పసి రాజా అన్న సెటైర్ ద్వారా అర్థం అవుతోంది అని అంటున్నారు.
లోకేష్ దూకుడు ఎంత చేస్తున్నా స్పీడ్ ఎంత పెంచుతున్నా అన్నీ తండ్రి చాటు బిడ్డగానే సాగిపోతున్నాయని అంటున్నారు. వెనక కొండంత చంద్రబాబు ఉండబట్టే అన్నదే అంతా అంటున్నారు. అంటే నిజంగా లోకేష్ శ్రమ పరిశ్రమ అన్నవి వెలుగులోకి రావాలన్నా కేరాఫ్ బాబు అన్న నీడతో కష్టమే అని అంటున్నారు.
దాంతోనే లోకేష్ స్వపక్షంలోనూ విపక్షంలోనూ పసివానిగానే మిగిలిపోతున్నారా అన్న చర్చ వస్తోంది. మరి లోకేష్ ఎలా ఎలివేట్ అవుతారు అంటే పూర్తిగా బాబు నీడ నుంచి బయటకు వచ్చినపుడే అంటున్నారు. అంటే పూర్తి స్థాయిలో పగ్గాలు లోకేష్ సొంతమై ఆయన ఇదే తీరున దూకుడు చేసేంతవరకూ ఆయన పసిరాజాయే అన్నది వైసీపీ సహా అంతా ఫిక్స్ అయిపోతున్నారా అంటే సీన్ చూస్తే అలాగే ఉంది మరి.

# త్వరగా నిద్రపట్టడం లేదా.. అయితే ఈ చిట్కాలు పాటించండి..

:పూర్వ కాలంలోని జనాలకు ఇట్టా మంచం ఎక్కరో లేదో.. అట్టా నిద్రపోతారు. ఒక్కోసారి నిద్ర ముంచుకొస్తుంది. అలాంటప్పుడు ఆలస్యం చేయకుండా బెడ్డెక్కేస్తారు.అలా కనీసం8 గంటలు నిద్రపోయేవారు.. అందుకేనేమో మరి అప్పటి వాళు ఎలాంటి అలుపు.. సొలుపు లేకుండా.. వందేళ్లకు పైగా జీవించేవారు. కాని ఇప్పటి యూత్? రోజుకు కనీసం రెండు గంటలు కూడా నిద్రపోవడం లేదు. మారిన జీవన పరిస్థితుల్లో మంచి నిద్ర కరువైపోయింది. ఆహారపు అలవాట్లు, పనివేళలు నిద్రను దూరం చేస్తున్నాయి. దీని వల్ల మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయి. నిద్ర లేమి ప్రస్తుతం ప్రధాన ఆరోగ్య సమస్యగా మారింది. నిద్రలేమితో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.–ఈ సమస్య నుంచి బయట పడటానికి రకరకాల మందులను కూడా వాడుతున్నారు. అయితే నిద్రలేమి సమస్య గురించి పరిశోధకులు కొన్ని చిట్కాలను సూచిస్తున్నారు. వాటిని పాటిస్తే తప్పకుండా హాయిగా నిద్రపోవచ్చని చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.



వయస్సుపెరిగే కొద్ది నిద్రలేమి సమస్యతో బాధపడే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తుంది. నిద్ర పట్టకపోవడానికి కేవలం నిద్రలేమి సమస్య మాత్రమే కారణం కాకుండా మధుమేహం లాంటి అనారోగ్య సమస్యలు కూడా కారణం కావచ్చు. ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. అయితే అతి నిద్ర, తక్కువ నిద్ర కూడా రెండు ఆరోగ్యానికి మంచివి కావని పలు అధ్యయనాల్లో రుజువైంది.

ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోవడాన్ని తక్కువ నిద్ర అంటారు. 10 గంటలకన్నా ఎక్కువ నిద్రపోతే అతినిద్ర అని అంటారు. ఈ రెండూ ఆరోగ్యానికి మంచివి కావు. నిద్రలేమి అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతుంది. దీనికి సంబంధించి ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన 153 అధ్యయనాల్లో వేలమంది పాల్గొన్నారు. ఇందులో చాలా మంది నిద్రలేమితో మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులు వచ్చాయని అన్నారు.

యుక్తవయస్సు వారు రాత్రులు ఆలస్యంగా నిద్రపోవడం వల్ల అది మధుమేహానికి దారితీస్తుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. నిద్రలేమితో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించే సామర్థ్యం కూడా తగ్గుతుంది. అంతేకాకుండా నిద్రలేమి రోగ నిరోధక వ్యవస్థను దెబ్బతీస్తుందని దీంతో ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

పడుకునే ముందు: పడుకునే ముందు సులభంగా నిద్ర పట్టాలంటే పుస్తకం చదవడం, స్నానం చేయడం, ధ్యానం చేయడం లాంటివి చేయడం చేయాలి. కాలేజీ, స్కూల్ లో చదువుకునే సమయాల్లో మనకు పుస్తకం తెరవగానే నిద్ర కమ్ముకొచ్చేస్తుంది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి రావచ్చు. ఒకసారి ట్రై చేసి చూడండి.

ఫోన్ కంప్యూటర్ వాడకం: నిద్రపోయే ముందు కంప్యూటర్, ఫోన్లను ఎక్కువగా ఉపయోగించవద్దు. వాటి నుంచి వెలువడే బ్లూ లైట్ వల్ల కళ్లు దెబ్బతినే ప్రమాదం ఉంది. పడుకునే కొన్ని నిమిషాల ముందు ఫోన్ లేదా కంప్యూటర్ వాడకూడదు. కొందరు చీకట్లో ఫోన్, కంప్యూటర్లను ఆపరేట్ చేస్తూ ఉంటారు. ఇది కంటికి మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా నిద్రను కూడా ఇది దూరం చేస్తుంది.

వ్యాయామం: నిద్రపోయే ముందు బ్రీతింగ్ వ్యాయామం వంటివి చేయడం వల్ల నిద్ర త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది. ప్రతి రోజు ఉదయం గంట వ్యాయామం చేయడం వల్ల శరీరం అలసిపోతుంది. రోజు పనులన్నీ పూర్తి చేసుకుని రాత్రి భోజనం చేయడం వల్ల శరీరం అలసిపోయి త్వరగా నిద్రపడుతుంది.

తియ్యని పదార్థం: ఒక గ్లాస్ పాలల్లో కాస్త చెక్కర వేసుకొని తాగడం వల్ల హాయిగా నిద్ర పడుతుంది. తీయటి పదార్థాలు నిద్రను ప్రేరేపించేందుకు ఉపకరిస్తాయి. దీంతో నిద్ర త్వరగా పడుతుంది. ప్రతిరోజు చెక్కర తీసుకోవడం కూడా శరీరానికి ఆరోగ్యకరం కాదు అనే విషయాన్ని మాత్రం మరిచిపోవద్దు.

# తరచూ అలసటగా ఉంటోందా.. ఈ చిన్న మార్పులతో దూరం చేసుకోవచ్చు!

**అలసిపోయినట్టుగా ఉండటానికి పెద్ద సమస్యలేవీ ఉండకపోవచ్చన్న నిపుణులు**

**డీహైడ్రేషన్ నుంచి కూల్ డ్రింకుల దాకా సమస్యకు కారణం**

**కొన్ని మార్పులు చేసుకుంటే జోష్ వస్తుందని వెల్లడి**



:కొందరు ఆహారం బాగానే తీసుకున్నా, మిగతా అన్నీ బాగానే ఉన్నా.. బాగా డల్ గా ఉంటారు. ఎప్పుడూ అలిసిపోయినట్టుగా కనిపిస్తుంటారు. దానికి కారణం పెద్ద పెద్ద వ్యాధులు, అనారోగ్య సమస్యలేమీ కాకపోవచ్చు. మన నిత్య జీవన శైలిలోని కొన్ని అలవాట్లే దీనికి కారణం కావొచ్చని ఆరోగ్య నిపుణులు చెప్తున్నారు. చూడటానికి అవి చాలా సింపుల్ గానే కనిపించినా.. వాటి ప్రభావం ఎక్కువగానే ఉంటుందని హెచ్చరిస్తున్నారు. వాటిని మార్చుకుంటే.. ఎప్పుడూ యాక్టివ్ గా ఉండవచ్చని చెప్తున్నారు. అవేమిటో చూద్దామా..

**డీహైడ్రేషన్..**

చూడటానికి చిన్నగానే కనిపిస్తుంది. కానీ సమయానికి నీళు తాగకపోతే.. శరీరంలో తగిన స్థాయిలో నీళ్లు లేకపోతే.. విపరీతంగా నిస్సత్తువ ఆవహిస్తుంది. దాహంగా అనిపించినప్పుడు తాగుతాం కదా అని అనుకోవద్దని.. డీహైడ్రేషన్ అప్పటికే మొదలై, మనం డల్ గా అవడం మొదలైన తర్వాత దాహంగా అనిపిస్తుందని యూనివర్సిటీ ఆఫ్ కనెక్టికట్ పరిశోధకులు చెప్తున్నారు. ముఖ్యంగా మహిళలకు ఈ సమస్య ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

**నోరు తెరుచుకుని నిద్రపోయినా..**

కొందరు రాత్రిపూట నోరు తెరుచుకుని నిద్ర పోతుంటారు. ఇది శరీరం డీహైడ్రేషన్ అవడానికి దారి తీస్తుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. లేదా ఏవైనా శ్వాస సమస్యలు ఉన్నాయని అర్థమని వివరిస్తున్నారు. ఇది శరీరానికి తగిన విశ్రాంతి లేకుండా చేసి.. అలసటను పెంచుతుందని అంటున్నారు. వీలైతే శ్వాస ఎక్సర్ సైజులు చేస్తే.. ఈ సమస్య నుంచి తప్పించుకోవచ్చని వివరిస్తున్నారు.

**శరీరంలో ఐరన్ లోపం..**

మన శరీరంలో ఐరన్ లోపం ఉంటే.. శరీరం నిస్సత్తువగా ఉంటుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. పైకి బాగానే కనబడినా, ఇతర ఆరోగ్య సమస్యలేవీ పెద్దగా లేకున్నా.. అలసటగా అనిపిస్తుంటే ఐరన్ లోపం అయి ఉంటుందని వివరిస్తున్నారు. తగిన ఆహారం తీసుకుంటే.. ఐరన్ శరీరానికి అంది శక్తివంతం అవుతుందని స్పష్టం చేస్తున్నారు.

**కాఫీలు, టీలు, కూల్ డ్రింకులు..**

ఇక అతిగా కాఫీలు, టీలు తాగే అలవాటు.. కాసేపు శరీరాన్ని ఉత్సాహంగా ఉంచినా తర్వాత ప్రయోజనం ఉండదని నిపుణులు చెప్తున్నారు. ముఖ్యంగా నిద్రకు ఐదారు గంటల ముందు నుంచీ.. అంటే సాయంత్రం నాలుగు, ఐదు గంటల తర్వాతి నుంచి కాఫీ, టీలు, కెఫీన్ కూల్ డ్రింకులకు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు. అవి శరీరం పూర్తి విశ్రాంతి తీసుకోలేకుండా చేసి.. అలసటను పెంచుతాయని అంటున్నారు.

**ఆల్కాహాల్ అలవాటు..**

ముందు రోజు రాత్రి తాగిన ఆల్కాహాల్.. ఆ తర్వాతి రోజు కూడా ఎఫెక్ట్ చూపిస్తుందని నిపుణులు చెప్తున్నారు. ఆల్కాహాల్ వల్ల గాఢ నిద్ర కాకుండా.. మగత నిద్ర పడుతుందని, శరీరానికి పూర్తి విశ్రాంతి లభించని అంటున్నారు. అందుకే మరునాడు పొద్దంతా తీవ్ర అలసటగా ఉంటుందని వివరిస్తున్నారు.

**కదలకుండా కూర్చుండటం, ఎక్సర్ సైజ్ లేకపోవడం..**

ఎక్కువ సేపు కదలకుండా కూర్చుండిపోవడం, శరీరానికి తగినంత వ్యాయామం లేకపోవడం వల్ల.. శరీరంలో మెటబాలిజం తగ్గిపోతుందని వైద్య నిపుణులు చెప్తున్నారు. ఇది శరీరాన్ని శక్తి విహీనం చేస్తుందని.. ఏ చిన్న పని చేసినా అలసిపోతారని స్పష్టం చేస్తున్నారు. అందుకే తరచూ లేచి నడవటం, వ్యాయామం చేయడం, ఇంటి పనులు, ఇతర పనులు చేయడం మంచిదని సూచిస్తున్నారు.


# కిషన్ రెడ్డి లౌక్యం.. సీట్లు తగ్గవని చెబుతున్నారు కానీ !




**హైదరాబాద్ పెన్ పవర్:** తాజాగా ఒక ప్రముఖ చానల్ ఇంటర్వ్యూకి వచ్చిన కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి అనేక విషయాల మీద మాట్లాడారు. రాజకీయంగా కూడా ఎన్నో పంచుకున్నారు ఇదిలా ఉంటే దక్షిణాది మీద వివక్ష అలాగే డీలిమిటేషన్ వల్ల తగ్గే ఎంపీ సీట్ల గురించి ఆయన మాట్లాడారు.దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు ఏ మాత్రం తగ్గవని కిషన్ రెడ్డి చెబుతున్నారు. కానీ అదే టైం లో ఉత్తరాదిన రాష్ట్రాలకు పెరిగే సీట్ల పద్ధతిన దక్షిణాదిన సీట్లు అంతే స్థాయిలో పెరుగుతాయని హామీ ఇవ్వలేకపోతున్నారు అని అంటున్నారు.ప్రధాని మోడీ కేంద్ర మంత్రి హోం మంత్రి అమిత్ షా వంటి వారు ఇప్పటికే ఇదే విషయం స్పష్టం చేశారు అని కూడా కిషన్ రెడ్డి చెప్పారు. ఒక్క సీటు కూడా తగ్గదని మాట ఇస్తున్నాను అని ఆయన అన్నారు. మరి ఎన్ని సీట్లు ఎక్కువగా పెరుగుతాయన్నది మాత్రం చెప్పలేదని ప్రజాస్వామ్య ప్రియులు మేధావులు అంటున్నారు.

ఉదాహరణకు యూపీలో తీసుకుంటే ప్రస్తుతం 80 ఎంపీ సీట్లు ఉన్నాయి. ఈ సంఖ్య కాస్తా డీలిమిటేషన్ తరువాత ఏకంగా 120 ఎంపీ సీట్లకు పెరుగుతాయని ప్రచారం అంటే అంటే యాభై శాతం పెరుగుదల అన్న మాట. మరి తమిళనాడులో 39 ఉన్నాయి. యాభై శాతం అదే రకమైన పెరుగుదల దామాషా పద్ధతిలో జరగాలి అంటే 60 దాకా ఎంపీ సీట్లు రావాలి. తెలంగాణాకు 27 దాకా రావాలి. ఏపీకి 38 దాకా సీట్లు రావాలి. కర్ణాటక అయితే 42 అవాలి. కేరళకు 30 ఎంపీ సీట్లు పెరగాలి.కానీ చూడబోతే తమిళనాడుకు 39 కాస్తా ఒకటి రెండు సీట్లు పెరిగి 41కి నంబర్ చేరుకుంటుంది అని అంటున్నారు. అలాగే ఏపీలో మరో రెండో మూడో సీట్లు పెరిగి 28 దాకా అవుతుందని, తెలంగాణా కూడా రెండో మూడో పెరిగి 20 అవుతుందని కేరళకు అయితే ఒకటి రెండు సీట్లు తగ్గి 18 అవుతాయని అంటున్నారు. ఒకవేళ సీట్లు తగ్గవని అనుకుంటే కేరళ 20 కంటే పెరిగే చాన్స్ లేదు.మరి జనాభా ప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి నష్టమే తప్ప లాభం ఎక్కడ ఉందనే అఖిలపక్ష సమావేశంలో సౌత్ స్టేట్స్ లీడర్స్ ప్రశ్నలు సంధించారు కానీ కేంద్ర మంత్రి మాత్రం ఒక్క సీటూ తగ్గదనే అంటున్నారు. తప్ప ఎన్ని సీట్లు పెరుగుతాయన్నది మాత్రం చెప్పలేదని గుర్తు చేస్తున్నారు.తాము దక్షిణాదికి అన్యాయం చేయమని వివక్ష అన్నదే లేదని కిషన్ రెడ్డి అంటున్నారు. కానీ ఇటీవల చెన్నైలో జరిగిన సౌత్ స్టేట్స్ లీడర్స్ అఖిలపక్ష సమావేశంలో కేంద్రానికి పన్నుల రూపంలో ఒక రూపాయి దక్షిణాది రాష్ట్రాల నుంచి వెళ్తే తిరిగి ఇచ్చేటపుడు మాత్రం యాభై పైసలు కూడా రావడం లేదని కొన్ని చోట్ల అయితే అది నలభై పైసలకు కూడా ఉంటోంది అని అంటున్నారు.ఈ విషయాల మీద కూడా కిషన్ రెడ్డి సహా కేంద్ర పెద్దలు ఫుల్ క్లారిటీ ఇస్తే బాగుంటుంది అని అంటున్నారు. ఇక ఇదే ఇంటర్వ్యూలో బీజేపీకి కొత్త అధ్యక్షుడు ఎవరు అంటే దేవుడికే తెలియాలి అని కిషన్ రెడ్డి ఆసక్తిని పెంచే సమాధానం చెప్పారు. బీజేపీలో ఎవరైనా ప్రెసిడెంట్ కావచ్చు అని ఆయన దానికి కొనసాగింపుగా మరో మాట చెప్పారు.బీజేపీలో ప్రజాస్వామ్యం ఉందని ప్రాంతీయ పార్టీలలో వారసత్వం ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ లో వారసత్వ రాజకీయం సాగుతోందని అలాగే ఇతర ప్రాంతీయ పార్టీలు కుటుంబ పార్టీలుగా మారిపోయాయని ఆయన విమర్శించారు. మొత్తానికి చూస్తే కిషన్ రెడ్డి తమ పార్టీ పదేళ్ల పాలనలో దేశంలో అన్ని రాష్ట్రాలు అభివృద్ధి సాధించాయని ప్రపంచ దేశాలలో భారత్ తలెత్తుకుని తిరిగేలా చేసింది నరేంద్ర మోడీ అని అంటున్నారు.

# నేపాల్ లో రగులుతున్న హిందూ దేశం వివాదం.. బాలీవుడ్ హీరోయిన్ మద్దతు



**హైదరాబాద్ పెన్ పవర్:** హిమాలయ దేశం నేపాల్.. ప్రంపంచలో ఏకైక హిందూ దేశం కొన్నాళ్ల కిందట వరకు.. అక్కడ రాచరికం ఉండేది. అయితే, దీనిని రద్దుచేసి ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటైంది. అయితే, కొన్నాళ్లుగా మళ్లీ నేపాల్ లో ఆందోళనలు మొదలయ్యాయి. రాచరికం పునరుద్దరించాలంటూ కొన్ని రోజులుగా భారీఎత్తున నిరసనలు కొనసాగుతున్నాయి.వాస్తవానికి గత ఏడాది నేపాల్ లో ప్రభుత్వం మారింది. ప్రచండ రాజీనామా చేసి కేపీ శర్మ ఓలీ అధికారంలోకి వచ్చారు. శర్మ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ప్రారంభమైన నిరసనలు హిందూ రాష్ట్రం డిమాండ్ వైపు వెళ్లాయి. నిరసనకారుల్లో చాలామంది దేశంలో రాచరికాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్ చేశారు.2008లో నేపాల్ లో రాచరిక వ్యవస్థను రద్దు చేశారు. దీనికి 239 సంవత్సరాలు రాచరిక వ్యవస్థ కొనసాగింది. చివరి రాజు జ్ఞానేంద్ర. ఇప్పుడు ఆయనను తిరిగి దేశ పగ్గాలు చేపట్టమంటున్నారు. ఇటీవల ఆయన విదేశాల నుంచి రాగా.. స్వాగతించడానికి పెద్దఎత్తున ప్రజలు గుమిగూడారు. కొందరు నేపాల్ పొరుగున ఉండే ఉత్తరప్రదేశ్ కు చెందిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చిత్రపటాలు పట్టుకుని హిందూ దేశం నినాదాలు చేశారు. ఇక నేపాల్ లో ప్రజాస్వామ్యం అమల్లోకి వచ్చిన 2008 నుంచి 11 సార్లు ప్రభుత్వాలు మారాయి. ఆరు నెలల కిందట ప్రచండ దిగిపోయి కేపీ శర్మ ఓలీ వచ్చారు. దీంతోనే ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై ప్రజలు విసిగిపోయారు.మరోవైపు ప్రజాస్వామ్యం ముసుగులో నేపాల్ ప్రభుత్వాలు వామపక్ష చైనా వైపు మొగ్గుచూపుతున్నట్లు అనుమానాలు ఉన్నాయి. దీంతోనే భారత వ్యతిరేక చర్యలకు దిగుతున్నట్లు కథనాలు వచ్చాయి. ఇవన్నీ పక్కనపెడితే నేపాల్ లో హిందూ దేశం డిమాండ్ కు బాలీవుడ్ లో ఒకప్పుడు టాప్ హీరోయిన అయిన మనీషా కొయిరాలా గట్టి మద్దతు పలికారు.ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తమ దేశం హిందూ దేశంగా ఉన్నప్పుడు చాలా బాగుందని కొనియాడారు. ప్రపంచంలో ఏకైక హిందూ దేశంగా ఉన్నప్పుడు ప్రత్యేక గుర్తింపు ఉండేదన్నారు. దేశం శాంతియుతంగా ఉందని, హిందూ దేశ హోదాను ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. దీనివెనుక కుట్ర ఏమైనా ఉందా? అని వ్యాఖ్యానించారు.కాగామనీషా కొయిరాలా సొంత దేశం నేపాల్ అనే సంగతి తెలిసిందే. బొంబాయి, భారతీయుడు, ఒకే ఒక్కడు సినిమాలతో తెలుగు వారికి బాగా దగ్గరైంది. అనేక భారతీయ భాషల సినిమాల్లో నటించింది. నేపాల్ లో కొయిరాలా కుటుంబం భారత దేశంలో గాంధీ కుటుంబం తరహాలో పేరొందింది. మనీషా తండ్రి ప్రకాష్ కొయిరాలా. తాత విశ్వేశ్వర ప్రసాద్ కొయిరాలా నేపాల్ కు 22వ ప్రధాన మంత్రి.

# క్యాచ్‌తో సన్ రైజర్స్‌కు పెద్ద షాకిచ్చాడు: బౌండరీ దగ్గర ఆసీస్ క్రికెటర్ విన్యాసం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 లీగ్ లు ఎక్కువైన తరుణంలో ఒక్క క్యాచ్ మ్యాచ్ ని డిసైడ్ చేసేస్తోంది. దీంతో బ్యాటింగ్, బౌలింగ్ మీదే కాదు ఫీల్డింగ్ మీద కూడా ప్లేయర్లు ఎక్కువగా దృష్టి పెడుతున్నారు. ఈ క్రమంలో క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమ్మశక్యం కానీ రీతిలో క్యాచులు అందుకుంటూ అభిమానులని థ్రిల్ కి గురి చేశారు. ఐపీఎల్, బిగ్ బాష్ లీగ్ లాంటి మెగా టోర్నీలో ఒకదానికి మించి మరో క్యాచ్ ని అందుకుంటూ ఆడియన్స్ కి కిక్ ఇస్తోనే ఉన్నారు. తాజాగా అలాంటి క్యాచ్ ఒకటి ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ లో నమోదయింది.

విశాఖ పట్నం వేదికగా ఆదివారం (మార్చి 30) ఢిల్లీ క్యాపిటల్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరుగుతోంది. సన్ రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేస్తుంది. ఇన్నింగ్స్ చివర్లో ఆస్ట్రేలియా జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ పట్టిన ఒక స్టన్నింగ్ క్యాచ్ సన్ రైజర్స్ జట్టును భారీ స్కోర్ కొట్టకుండా ఆపింది. ఇన్నింగ్స్ 16 ఓవర్ ఐదో బంతిని అనికేత్ డీప్ మిడ్ వికెట్ దిశగా ఆడాడు. ఈ బాల్ సిక్సర్ అనుకుంటున్నా సమయంలో సూపర్ మ్యాన్ తరహాలో ఫ్రేజర్-మెక్‌గుర్క్ గాల్లోకి అమాంతం ఎగిరి రెప్పపాటులో క్యాచ్ అందుకున్నాడు.

ఈ వికెట్ కోల్పోవడం సన్ రైజర్స్ కు చాలా మైనస్ అయింది. అప్పటివరకు సూపర్ బ్యాటింగ్ తో అదరగొడుతున్న అనికేత్ 40 బంతుల్లో 74 పరుగులు చేసి దూకుడు మీదున్నాడు. అతను చివరి వరకు క్రీజ్ లో ఉండి ఉంటే హైదరాబాద్ 180 పరుగులకు పైగా స్కోర్ చేసింది. కానీ కీలక సమయంలో ఈ క్యాచ్ జట్టుపై చాలా ప్రభావం చూపించింది. మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌట్ అయింది. యువ బ్యాటర్ అనికేత్ వర్మ (41 బంతుల్లో 74: 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మినహాయిస్తే మిగిలిన వారు కనీస ప్రదర్శన కూడా చేయలేకపోయారు.

# ఢిల్లీ క్యాపిటల్స్ భారీ విజయం.. వైజాగ్‌లో చిత్తుగా ఓడిన సన్ రైజర్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ పట్నం వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్ తో జరిగిన మ్యాచ్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ భారీ తేడాతో ఓడిపోయింది. టోర్నీలో హైదరాబాద్ జట్టుకు ఇది వరుసగా రెండో పరాజయం. బ్యాటింగ్ లో అనికేత్ వర్మ, బౌలింగ్ లో నీషన్ తప్పితే మిగిలిన వారు ఘోరంగా విఫలమయ్యారు. మరోవైపు అన్ని విభాగాల్లో సమిష్టిగా రాణించిన ఢిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. మొదట బ్యాటింగ్ మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌట్ అయింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ 16 ఓవర్లలో మూడు వికెట్లను 166 పరుగులు చేసి గెలిచింది.

164 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అలవోకగా ఛేజ్ చేశారు. ఓపెనర్లు డుప్లెసిస్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ తొలి వికెట్ కు 81 పరుగులు జోడించి మ్యాచ్ ను ఏకపక్షం చేశారు. స్వల్ప వ్యవధిలో వీరిద్దరూ ఔటయ్యారు. డుప్లెసిస్ 27 బంతుల్లో 50 పరుగులు చేసి ధనాధన్ ఇన్నింగ్స్ ఆడగా..ఫ్రేజర్-మెక్‌గుర్క్ 38 పరుగులు చేసి రాణించాడు. ఆ తర్వాత కాసేపటికే సిక్స్, ఫోర్ కొట్టి మంచి టచ్ లో కనిపించిన రాహుల్ బౌల్డయ్యాడు. మూడు వికెట్లు జీషన్ అన్సారీ తీసుకోవడం విశేషం. అభిషేక్ పోరెల్ (34), స్టబ్స్ (21) ఎలాంటి ఒత్తిడి లేకుండా మ్యాచ్ ను ముగించారు. అంతకముందు మొదట బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌట్ అయింది. యువ బ్యాటర్ అనికేత్ వర్మ (41 బంతుల్లో 74: 5 ఫోర్లు, 6 సిక్సర్లు) మినహాయిస్తే మిగిలిన వారు కనీస ప్రదర్శన కూడా చేయలేకపోయారు. ఢిల్లీ బౌలర్లలో స్టార్క్ ఐదు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు తీసుకున్నాడు. మోహిత్ శర్మకు ఒక వికెట్ దక్కింది. ఢిల్లీ క్యాపిటల్స్ కు టోర్నీలో ఇది వరుసగా రెండో విజయం కావడం విశేషం.

# టీమిండియాతో వన్డే, టీ20 సిరీస్.. షెడ్యూల్ ప్రకటించిన ఆస్ట్రేలియా



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ఆస్ట్రేలియా 2025-26 హోమ్ సీజన్ కోసం తమ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఇందులో భాగంగా టీమిండియాతో మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. 2020 తర్వాత ఇండియా తొలిసారి వైట్ బాల్ ఫార్మాట్ కోసం ఆస్ట్రేలియాలో పర్యటించనుంది. అక్టోబర్ 19 నుంచి 25 వరకు వన్డే సిరీస్.. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 19న పెర్త్ లో తొలి వన్డేతో టూర్ మొదలవుతుంది. అక్టోబర్ 23 న అడిలైడ్ లో రెండో వన్డే.. అక్టోబర్ 25 న సిడ్నీలో మూడో వన్డే జరుగుతుంది. ఆ తర్వాత టీ20 సిరీస్ జరుగుతుంది. అక్టోబర్ 29 న మనుకా ఓవల్ లో తొలి టీ20 ప్రారంభమవుతుంది. ఆ తర్వాత మెల్‌బోర్న్, హోబర్ట్, గోల్డ్ కోస్ట్, బ్రిస్బేన్ లలో వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు టీ20 మ్యాచ్ లు ఆడాలి ఉంది. ఇక ఇండియా సంగతి పక్కన పెడితే ఆస్ట్రేలియా తమ సమ్మర్ షెడ్యూల్ ను సౌతాఫ్రికాతో ప్రారంభించనుంది.


ఆగస్టు 10 నుండి ఆగస్టు 24 వరకు దక్షిణాఫ్రికాతో మూడు వన్డేలు, టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది. ఇక అందరూ ఎంతగానో ఎదురు చూస్తున్న యాషెస్ సిరీస్ నవంబర్ 8 నుంచి స్టార్ట్ అవుతుంది. ఇంగ్లాండ్ తో జరగబోయే ఈ చారిత్రాత్మక సిరీస్ నవంబర్ 21న పెర్త్‌లో ప్రారంభమై జనవరి 8 వరకు కొనసాగుతుంది.

# అందంగా కనిపించడానికి లక్షలు ఖర్చు చేయాలి



రెజీనా కసాండ్రా యొక్క అద్భుతమైన స్నాప్‌లు మరియు మ్యాక్సీ మ్యాజిక్!

తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకున్న రకుల్ ప్రీత్ సింగ్ సౌత్ లోని అగ్ర హీరోలందరితోనూ నటించింది. ప్రస్తుతం తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న రకుల్ రీసెంట్ గా ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొని సెలబ్రిటీలకు ఉండే ఖర్చుల గురించి తెలిపింది. సెలబ్రిటీలకు ఎలాంటి ఖర్చులుండవు. ఆఖరికి వాళ్లు ఎక్కడికైనా వెళ్లాలంటే వాళ్లు వేసుకునే బట్టలతో సహా ఎవరొకరు ఫ్రీగా పంపుతారని అందరూ అనుకుంటారు. కానీ తమకుండే ఖర్చులు తమకుంటాయని, కాస్ట్యూమ్స్ ఫ్రీ గా ఇచ్చినా మేకప్, హెయిర్ స్టైలిస్టులకు తామెంతో డబ్బు ఇవ్వాల్సి ఉంటుందని రకుల్ వెల్లడించింది. రెడ్ కార్పెట్ పై సెలబ్రిటీలు అందంగా కనిపించాలంటే దాని వెనుక



ఎంతోమంది శ్రమ, కష్టం ఉంటాయని, జస్ట్ ఒక్క లుక్ కోసం తాము రూ. 20 వేల నుంచి రూ. లక్ష వరకు ఖర్చు పెట్టాల్సి వస్తుందని, స్టైలిస్ట్ నుంచి మేకప్ టీమ్ కు, ఫోటోగ్రాఫర్లకు ఇలా ప్రతీ ఒక్కరికీ డబ్బు ఇవ్వాల్సి ఉంటుందని, దీని కోసం తనకొక టీమ్ కూడా ఉందని రకుల్ చెప్పింది. ఆరేళ్లుగా తన దగ్గర మేకప్, హెయిర్ స్టైలిస్ట్ కోసం ఒకే టీమ్ పని చేస్తుందని, వాళ్లను తాను ఫ్యామిలీ మెంబర్స్ లానే ట్రీట్ చేస్తానని రకుల్ చెప్పుకొచ్చింది. ఈవెంట్స్ కోసం తమకు ఫ్రీ గా బట్టలు పంపించినప్పటికీ దాన్ని తెచ్చిన వారికి, ఆ డ్రెస్ కు తగ్గట్టు తమని అందంగా రెడీ చేసిన వారికి డబ్బులివ్వాల్సి ఉంటుందని రకుల్ తెలిపింది. కొరియర్ ఛార్జీలు కూడా అందులోనే యాడ్ చేస్తారని, ఎవరైనా ఇంటర్నేషనల్ డిజైనర్ పంపిన డ్రెస్ వేసుకోవాలంటే ఆ ఖర్చు ఇంకా అదనంగా ఉంటుందని రకుల్ చెప్పింది. డిజైనర్లు తమకు డ్రెస్సులు ఫ్రీ గా ఇచ్చేది ఆ డ్రెస్ వేసుకున్నప్పుడు వాటికి ఎక్కువ అటెన్షన్ వస్తుందని, దాని వల్ల వారికి సేల్స్ పెరుగుతాయని మాత్రమేనని, అయితే తాను మాత్రం ఎక్కువ శాతం ఫ్రీ గా బట్టలు తీసుకోవడడానికి ఇష్టపడనని రకుల్ చెప్పింది.



నలుపు రంగులో అమృతా ఖాన్విల్కర్ అద్భుత మైన షాట్స్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com